ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



# గుంటూరు జిల్లా వార్తలు

5

సోమవారం 21 అక్టోబరు 2024





సముద్రానికి ఆనకట్టగా నిలిచిన మడ అడవి

# మడ రక్షణ కవచం

8

- సునామీ, తుఫాన్లను ఎదుర్కొనే శక్తి
- 2018లో అంతర్జాతీయంగా గుర్తింపు
- జీవ వైవిధ్యానికి నిలయం మడ అడవులు
- రేపల్లె తీరంలో అభయారణ్యంగా అభివృద్ధి

సముద్రంలో 20 మీటర్ల ఎత్తు ఎదిగిన మడ అడవి

ఆదాయమే

ఆదాయం.. కాసుల గలగలలతో ఎక్సైజ్ కళకళలాడుతోంది. దరఖాస్తుల నుంచి లైసెన్సు ఫీజుల వరకు రూ.కోట్లు ఆదాయాన్ని ఎక్సైజ్ కళ్ల చూసింది. గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లో తొలి ఏడాది మద్యం ఆదాయం సుమారు రూ.424కోట్లు వచ్చినట్లు సమాచారం. వైసీపీ పాలనలో నిస్తేజంగా మారిన ఎక్సైజ్ విభాగం కూటమి ఏలుబడిలో గత వైభవం దిశగా అడుగులేస్తోంది. దరఖాస్తుల ప్రక్రియ మొదలు లాటరీ, లైసెన్సులు జారీ, స్టాక్‌కు ఇండెంట్, దుకాణాల ప్రారంభం తదితర అంకాలన్నీ విజయవంతంగా ముగియడంతో పాటు ప్రభుత్వ ఖజానాకు రాబడి ఆశించిన స్థాయిలోనే దక్కడంతో ఎక్సైజ్ శాఖ ఆనందంలో ఉంది.



# ఎక్సైజ్.. ఖుషీ

- మస్తుగా మత్తు రాబడి
- దరఖాస్తుల ఆదాయం రూ.184 కోట్లు
- లైసెన్సు ఫీజు సుమారు రూ.240 కోట్ల ఆర్జన
- వైసీపీ పాలనలో నిస్తేజంగా ఎక్సైజ్ విభాగం

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

వైసీపీ పాలనలో ప్రభుత్వమే మద్యం వ్యాపారం నిర్వహించింది. మద్యాన్ని నియంత్రిస్తూ అక్రమ మద్యాన్ని అరికట్టాల్సిన ఎక్సైజ్ విభాగాన్ని వైసీపీ ప్రభుత్వం పనిలేకుండా చేసింది. కూటమి ప్రభుత్వం మద్యం నూతన పాలసీని ప్రవేశపెట్టి మద్యం వ్యాపారాన్ని ప్రైవేటుకు అప్పగించింది. మద్యం షాపులను ప్రైవేటు వ్యక్తులకు అప్పగించే కార్యక్రమంలో భాగంగా ఈ నెల 1 నుంచి మొదలైన ప్రక్రియ ఇటీవల లైసెన్సుదారులు షాపులు ప్రారంభించడంతో ఓ కొలిక్కి వచ్చింది. దీంతో ఎక్సైజ్ విభాగానికి అటు దరఖాస్తుల రూపంలో కానీ ఇటు లైసెన్సు ఫీజు తొలి వాయిదా రూపేణా పెద్ద ఎత్తున ఆదాయం సమకూరింది. అన్నింటికన్నా మించి వైసీపీ ప్రభుత్వంలో విధులకు తమను దూరం చేసిందనే భావనలో ఉన్న ఎక్సైజ్ శాఖ ఉద్యోగులు ప్రైవేటు ప్రక్రియ మొదలైన దగ్గర నుంచి క్షణం తీరిక లేకుండా [illegible] ఒత్తిడిలో నిమగ్నమయ్యారు. బాపట్ల జిల్లాలో మొత్తం 7 సర్కిళ్ల పరిధిలో 117 షాపుల లైసెన్సుల కోసం [illegible] నోటిఫికేషన్ జారీ చేసిన సంగతి తెలిసిందే. గడువు ముగిసే ఈ నెల 11 నాటికి మొత్తం 2,149 దరఖాస్తులు రాగా దీని రూపేణా రూ.43 కోట్లు ఆదాయం ప్రభుత్వ ఖజానాకు సమకూరింది. లాటరీలో షాపులు దక్కించుకున్న లైసెన్సుదారులు ఏడాదికి 6 వాయిదాల్లో లైసెన్సు ఫీజు చెల్లించే వెసులుబాటును ప్రభుత్వం కల్పించగా తొలి వాయిదాలో ఎక్సైజ్ శాఖకు సమకూరిన ఆదాయం రూ.12.7 కోట్లుగా ఉంది. ఇది తొలి వాయిదానే కానుండడంతో ఏడాది ముగిసే సరికి లైసెన్సు ఫీజు ద్వారానే దాదాపు .రూ.73 కోట్లు రాబడి రానుంది. ఇది రెండో ఏడాదిలో మరింత పెరగనుంది. గుంటూరు జిల్లాలో 127 షాపులకు 4,448 దరఖాస్తులు రాగా రూ.89 కోట్ల ఆదాయం ఖజానాకు జమైంది. పల్నాడు జిల్లాలో 129 షాపులకు 2,638 దరఖాస్తులు రాగా రూ.52 కోట్ల ఆదాయం సమకూరింది. తొలి ఏడాది లైసెన్సు ఫీజు రూపంలో గుంటూరు జిల్లాలో రూ.87కోట్లు, పల్నాడు జిల్లాలో 80 కోట్ల రానుంది. మూడు జిల్లాలకు కలిపి మొత్తం ఏడాదికి లైసెన్సు ఫీజు రూపంలో రూ.240 కోట్లు ప్రభుత్వానికి రాబడి రానుంది.

### నిబంధనలపై కసరత్తు

మద్యం దుకాణాలను శాశ్వత ప్రాతిపదికన ఏర్పాటు చేసుకోవడానికి ఈ నెల చివరివరకు ఎక్సైజ్ శాఖ వెసులుబాటు ఇచ్చింది. ఇందులో భాగంగా లైసెన్సుదారులు అమ్మకాలు ఎక్కువగా జరిగే ప్రాంతాల్లో షాపు పెట్టడానికి వ్యాపారులు అన్వేషిస్తున్నారు. నిబంధనల ప్రకారం ప్రభుత్వ రికార్డుల్లో నమోదై ఉన్న గుడులు, బడులతో పాటు ఆస్పత్రులకు వంద మీటర్ల దూరంలోనే షాపులు ఉండాలి. ప్రైవేటు మద్యం దుకాణాలు తెరుచుకోగా మొన్నటి వరకు ఉన్న ప్రభుత్వ దుకాణాలు మూతపడ్డాయి. వాటిలోని స్టాక్‌తో పాటు ఇతర ఆస్తులను ఇప్పటికే రెవెన్యూ విభాగం సమక్షంలో గణించి భద్రపరిచారు.

### నిబంధనలను తప్పనిసరిగా పాటించాలి...

దుకాణాల ఏర్పాటులో ఎక్సైజ్‌శాఖ జారీచేసిన మార్గదర్శకా లను పాటించేలా లైసెన్సుదారులు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు కోరుతున్నారు. ప్రభుత్వం ఈ నెలఖారువరకు ఇచ్చిన వెసులుబాటును ఉపయోగించుకుని నిబంధనల ప్రకారం ప్రదేశాన్ని ఎంపిక చేసుకుని వ్యాపారం సాగించాలన్నారు. ఎమ్మార్పీ ఉల్లంఘనలపై కూడా దృష్టి పెడతామని అధికారులు చెబుతున్నారు.

### కొనసాగుతున్న ఒత్తిళ్లు..

లాటరీలో లైసెన్సు దక్కించుకున్న వారు ఇప్పటికే తాత్కాలిక ప్రాతిపదికన షాపులు ఏర్పాటు చేసుకున్నారు. పలు చోట్ల రద్దీ ప్రాంతాల్లో పోటీ పడడంతో కూతవేటు దూరంలోనే షాపులు ఏర్పాటు చేసుకున్నారు. బాపట్ల చీలురోడ్డు సెంటర్‌తో పాటు మార్కెట్ ఏరియాలో ఇదే పరిస్థితి నెలకొంది. షాపులు మార్చుకోవడానికి ఈ నెల చివరి వరకు ఎక్సైజ్ శాఖ గడువు ఇవ్వడంతో ఓ అవగాహనకు వచ్చి షాపులను దూరంగా పెట్టుకోవడానికి మంతనాలు జరుపుతున్నట్లు సమాచారం. మరో వైపు ఇప్పటికీ షాపుల దక్కించుకున్న వారితో తెరవెనక బేరసారాలు ముమ్మరంగానే జరుగుతున్నట్లు సమాచారం. పాలకపార్టీ నేతల అనుచరగణం లైసెన్సు దారులపై ఒత్తిడి తెచ్చి తాము భాగస్వాములయ్యే విధంగా ప్రయత్నాలు చేస్తూనే ఉన్నారు. టీడీపీ అధినాయకత్వం ఇప్పటికే మద్యం, ఇసుక వ్యవహారల్లో నేతల జోక్యం సహించేది లేదని తేల్చి చెప్పడంతో చాలా మంది నేతలు వెనకడుగు వేసినప్పటికీ వారి అనుచరగణం మాత్రం పట్టు వీడకుండా రాయబారాలు నడుపుతూనే ఉన్నారు.



# యంత్రాలు.. ఎప్పుడిస్తారో?

- రాయితీ పరికరాల కోసం నిరీక్షణ
- పంటలకు సూక్ష్మ పోషకాలూ లేవాయె
- కల్లాలపై కప్పే పట్టలకు ఎదురుచూపులు
- కూటమి ప్రభుత్వంపై అన్నదాతల ఆశలు





(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

స్ప్రేయర్లు, కల్టివేటర్లు, ట్రాక్టర్లు రైతులకు సాగులో సహాయకారిగా ఉంటాయి. పంటలకు నష్టం వాటిల్లకుండా మంచి దిగుబడులు వచ్చేందుకు సూక్ష్మపోషకాలు అవసరం. కల్లాల్లో పంట ఉత్పత్తుల రక్షణకు టార్పాలిన్ పట్టలు రైతులకు ఎంతో ఉపయోగంగా ఉంటాయి. గత టీడీపీ ప్రభుత్వం రైతులను ఆదుకునేందుకు రాయితీపై యంత్రపరికరాలను, సూక్ష్మపోషకాలను, ఉచితంగా టార్పాలిన్ పట్టలు పంపిణీ చేసింది. అయితే గత ఐదేళ్ల వైసీపీ పాలనలో వీటిని విస్మరించడంతో రైతులు తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ పరిస్థితుల్లో కూటమి ప్రభుత్వం బాధ్యతలు చేపట్టి నాలుగు నెలలు దాటుతున్నా రాయితీ పరికరాలు, సూక్ష్మపోషకాలు, టార్పాలిన్ పట్టలు పంపిణీ ఊసే మరిచింది. గత టీడీపీ పాలనలో యంత్ర పరికరాలు, సూక్ష్మ పోషకాలను క్రమం తప్పకుండా రాయితీపై పంపిణీ చేసినట్లే ఇప్పుడు కూడా అందించాలని అన్నదాతలు కోరుతున్నారు. యంత్రపరికరాలు, సూక్ష్మ పోషకాల కోసం పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల రైతులు ఎదురు చూస్తున్నారు. సాగుకు అవసరమయ్యే యంత్ర పరికాలు అందుబాటులో లేవు. కొన్నిచోట్ల అద్దె ప్రాతిపాదికను అందుబాటులో ఉన్నా అవి అందరికీ అందడంలేదు. ఇక రాయితీపై పంటలకు అవసరమైన సూక్ష్మపోషకాల పంపిణీ కూడా నిలిచిపోయి ఉంది. గతంలో టీడీపీ ప్రభుత్వం ఉన్నప్పుడు రాయితీపై యంత్రపరి కరాలు, సూక్ష్మపోషకాలు అందజేసి రైతులకు అండగా నిలిచేది. అయితే వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత రాయితీ అనే మాటను విస్మరించింది. యంత్ర పరికరాలు, సూక్ష్మపోషకాల పంపిణీ చేయడాన్ని విస్మరించింది. చివరకు టార్పాలిన్ పట్టలకు కూడా మంగళం పాడింది. దీంతో రైతులు తీవ్రంగా ఇబ్బందులు పడేవారు. ఈ పరిస్థితుల్లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో తిరిగి వ్యవసాయ రంగానికి పూర్వ వైభవం వస్తుందని.. సాగు కష్టాలు తీరతాయని.. రైతులు ఎదురుచూస్తున్నారు.

### గత ఐదేళ్లు సాగుకు ఇబ్బంది

సాగుకు యంత్రపరికరాలు ఎంతో అవసరం. ఇవి లేనిదే వ్యవసాయ పనులు ముందుకు సాగే పరిస్థితి లేదు. గత ఐదేళ్ల రాయితీ యంత్రపరికాల పంపిణీ జరగలేదు. దీంతో రైతులు సాగుకు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పంటలకు ఆశించే తెగుళ్ల నివారణకు మందు పిచికారి చేయాలంటే స్ప్రేయర్లు తప్పనిసరి. గ్రామాల్లో స్ప్రేయర్ల కొరతను రైతులు ఎదుర్కొంటున్నారు. అరకొర స్ప్రేయర్లతో మందు పిచికారి చేస్తున్నారు. దీనివల్ల మందు పిచికారిలో జాప్యం జరిగి పంటలు దెబ్బతింటున్నాయి. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో పెద్దఎత్తున తైవాన్ స్ప్రేయర్లు పంపిణీ జరిగింది. వాటిలో ఉన్న కొన్ని స్ప్రేయర్లతోనే రైతులు ఇప్పటి వరకు నెట్టుకు వస్తున్నారు. తైవాన్ స్ప్రేయర్లకు డిమాండ్ బాగుంది. రాయితీ స్ప్రేయర్ల కోసం వ్యవసాయ కార్యాలయాల చుట్టూ రైతులు ప్రదక్షిణలు చేస్తున్నారు. ప్రభుత్వం నుంచి స్ప్రేయర్లు సరఫరా లేదని అధికారులు చెబుతున్నారు. ఈ సమాధానంతో రైతులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. బ్యాటరీ స్ప్రేయర్లు, పవర్ స్ప్రేయర్లు, కల్టివేటర్లు, పవర్‌వీడర్, ట్రాక్టర్లు ఇలా 19 రకాల యంత్రపరికరాలను రాయితీపై పంపిణీ చేయాల్సి ఉంది. అయితే నేటి వరకు ప్రభుత్వం వీటి ఊసెత్తకపోవడంతో అన్నదాతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇక గత కొన్ని రోజులుగా అధిక వర్షాలు రైతుల గుండెల్లో వణుకు పుటిస్తున్నాయి. కల్లాల్లో ఆరబోసిన కుప్పలు తడవకుండా రైతులు పడరాని పాట్లు పడుతున్నారు. పట్టలు(టార్పాలిన్లు) అద్దెకు తెచ్చుకుని పంటలను కాపాడుకుంటున్నారు. ఈ విషయంలో మిరప రైతుల కష్టాలు చెప్పనలవి కావు. టీడీపీ ప్రభుత్వ హయాంలో ఉచితంగా పట్టలు పంపిణీ జరిగింది. వీటి పంపిణీని వైసీపీ ప్రభుత్వం విస్మరించింది. దీంతో మిరప కల్లాల్లో ఉన్న సమయంతో వర్షాలకు తడిచి రైతులు తీవ్రంగా నష్టపోయారు. రైతుల వద్ద పట్టలు లేక.. అద్దెకు దొరక్క మిరప, మొక్కజొన్న వంటి పంటలను కాపాడుకోలేక నష్టాలను చవిచూశారు. ప్రస్తుతం మిరప, ఇతర పంటలు చేతికి వచ్చే సమయానికి కూటమి ప్రభుత్వం పట్టలు పంపిణీ చేయాలని రైతులు కోరుతున్నారు.

### సూక్ష్మ పోషకాల కోసం పాట్లు

సూక్ష్మ పోషకాల లోపంతో పంటలకు నష్టం వాటిల్లుతోంది. జింక్, బోరాన్, మెగ్నీషియం, గంధకం, ఇనుము, మాంగనీస్, రాగి, భాస్వరం, నత్రజని, పొటాషియం వంటి సూక్ష్మ పోషకాలు పంటలకు అవసరం. గతంలో టీడీపీ ప్రభుత్వం ఆయా సూక్ష్మ పోషకాలను రాయితీపై రైతులకు అందించింది. ఈ సీజన్‌లో నేటి వరకు సూక్ష్మ పోషకాల పంపిణీ చేపట్టలేదు. సూక్ష్మపోషకాల వల్ల కలుగుతున్న పంటల నష్టాన్ని నివారించుకోవడానికి రైతులు ప్రైవేట్ వ్యాపారులను ఆశ్రయిస్తున్నారు. వీటి ధరలు మార్కెట్‌లో అధికంగా ఉండటంతో రైతులపై ఆర్థిక భారం పడుతోంది. పంటలకు తక్షణావసరంగా ఉన్న సూక్ష్మ పోషకాలను రాయితీపై అందించాలని రైతులు కోరుతున్నారు.



మిరప కల్లాలపై కప్పే పట్టలు

## బోరుగడ్డ అరాచకాలెన్నో..



- బోరుగడ్డ ల్యాప్‌టాప్, సెల్‌ఫోన్ స్వాధీనం
- నేడు మంగళగిరి ఫోరెన్సిక్ ల్యాబ్‌కు
- అతడు పెట్టిన పోస్టులు, వీడియో రికవరీ!
- తద్వారా అతడి వెనుక ఉన్న అదృశ్య శక్తుల కూపీ లాగేందుకు పోలీసుల యత్నం
- అతడి బ్యాంకు ఖాతాల్లో కోట్ల కొద్దీ డబ్బు
- వాటి లావాదేవీలపైనా ఆరా
- కస్టడీ విచారణకు కోర్టులో పిటిషన్!

(- మెయిన్‌లో..)

## ఎట్టకేలకు స్కూల్ గ్రాంట్ విడుదలకు గ్రీన్ సిగ్నల్

- మంత్రి లోకేష్ చొరవతో తీరనున్న నిధుల కొరత
- రెండు విడతల్లో విడుదలకు ఏర్పాట్లు

6

## టిప్పర్లు రోడ్డెక్కాలంటే.. ముడుపులు చెల్లించాల్సిందే

- కొందరు బ్రేక్ ఇన్‌స్పెక్టర్ల బలవంతపు వసూళ్లు
- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా నెలకు రూ.3 కోట్లకు పైనే

## ఆవాస్-2024పై ప్రాంతీయ శిక్షణ శిబిరం

- నేడు, రేపు గుంటూరులో నిర్వహణ
- హాజరుకానున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సీనియర్ ఐఏఎస్‌లు

6

## గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఆలపాటి

## పానకాల స్వామి దివ్యక్షేత్రంలో.. నూతన విధానం

- బిందె పానకం రూ.30కే
- హక్కులు అక్షయ్‌పాత్ర ఫౌండేషన్‌కు అప్పగింత



8

# ఇంజనీర్లు కావాలి

- 18 మంది ఏఈలకు ఏడుగురు
- ఐదుగురు ఈఈలకు విధుల్లో ఇద్దరు
- పూర్తిస్థాయిలో సిబ్బంది లేక సాగని పనులు
- గుంటూరు కార్పొరేషన్‌లో ఇంజనీరింగ్ విభాగం ప్రక్షాళన ఎప్పటికో?

గుంటూరు కార్పొరేషన్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధి పనులు.. సాంకేతిక విభాగాలు.. తదితరాల పర్యవేక్షణకు, నిర్వహణకు ఇంజనీర్లు కావాలి. ఆయా పనులకు సిబ్బంది కావాలి. కానీ గుంటూరు నగర పాలక సంస్థలో ఇంజనీర్లు, ఇంజనీరింగ్ విభాగాల్లో సిబ్బంది కొరత ఉంది. పద్దెనిమిది మంది ఏఈలకు ఏడుగురు, ఐదుగురు ఈఈలకు ఇద్దరు మాత్రమే విధుల్లో ఉన్నారు. ఇక ఆయా విభాగాల్లో పదుల సంఖ్యలో ఇంజనీరింగ్ సిబ్బంది లేరు. అధికారులు, సిబ్బంది కొరత ఉన్న ఇంజనీరింగ్ విభాగం ప్రక్షాళనపై జీఎంసీ ఉన్నతాధికారులు దృష్టి సారించాల్సి ఉంది. అధికారులు, సిబ్బంది కొరతతో నగరపాలక సంస్థతో పాటు విలీన గ్రామాల్లో కూడా పెద్ద ఎత్తున అభివృద్ధి పనులకు ఆటంకం ఏర్పడుతుంది. క్షేత్రస్థాయిలో అధికారులు, సిబ్బంది లేకపోవడంతో రోడ్లు, డ్రెయిన్ల మరమ్మతులు, వీధి దీపాల నిర్వహణ సక్రమంగా జరగడంలేదు. గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో 57 డివిజన్లు ఉండగా అందులో ఇంజనీరింగ్ సంబంధించిన పనులను పర్యవేక్షించేందుకు కేవలం ఏడుగురు ఏఈలు మాత్రమే ఉన్నారు. నగరపాలక సంస్థకు ఐదుగురు ఈఈలకు ఇద్దరే ఉన్నారు. దీంతో ఎక్కడ కూడా అభివృద్ధి పనులు ఆశించిన మేర జరగడం లేదు. అభివృద్ధి పనులకు సంబంధించిన టెండర్ల ప్రక్రియలో కూడా జాప్యం జరుగుతుంది. పనులు ప్రారంభం.. పర్యవేక్షణ సక్రమంగా జరగడంలేదు. దీంతో జరిగే అరకొర పనులు కూడా నాసిరకంగానే ఉంటున్నాయి. కేవలం వర్క్ ఇన్‌స్పెక్టర్లపైనే ఇంజనీరింగ్ వ్యవహారం అంతా నడుస్తున్నట్లు సమాచారం. ఇటీవల కురుస్తున్న వర్షాలకు అంతర్గత, ప్రధాన రహదారులన్నీ గుంతల మయంగా మారాయి. కనీసం వాటికి మరమ్మతులు చేపట్టేందుకు అనుమతులు వచ్చినా అధికారులు లేకపోవడంతో టెండర్ల ప్రక్రియ సాగక, పనుల్లో కాలయాపన జరుగుతుంది. ఫలితంగా నగర ప్రజలకు శాపంగా మారింది. నగరపాలక సంస్థకు చెందిన వాహనాల మరమ్మతులు, నిర్వహణకు కార్పొరేషన్‌లో వాహనాల షెడ్ ఉంది. వాహనాల పర్యవేక్షణ సక్రమంగా లేదని కమిషనర్ శ్రీనివాసులు ఆకస్మిక తనిఖీల్లో వెలుగుచూసింది. ఈ క్రమంలో ఇక్కడ అడ్డగోలుగా బిల్లులు పెట్టుకుని దోపిడీ చేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.

### వీధి దీపాల నిర్వహణ అస్తవ్యస్తం..

నగరంలో వీధి దీపాల నిర్వహణ అస్తవ్యస్తంగా ఉంది. ప్రధాన రహదారులు సైతం అంధకారంలో ఉంటున్నాయి. జీఎంసీ ఎలక్ట్రికల్ విభాగం పటిష్టంగా లేకపోవడమే ఇందుకు కారణం. క్షేత్రస్థాయిలో ఎలక్ట్రికల్ సిబ్బంది లేకపోవటం, ఏఈల బాధ్యతా రాహిత్యం, డీఈల పర్యవేక్షణ కొరవడంతో ప్రధాన ప్రాంతాలు కూడా చీకట్లో ఉంటున్నాయి. శివారు ప్రాంతాలు, విలీన గ్రామాల సంగతి ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. అసలు ఇంజనీరింగ్ విభాగాల్లో ఎంతమంది పనిచేస్తున్నారు.. వారంతా ఎక్కడ ఉన్నారు.. ఏమి చేస్తున్నారు.. అనేది ఎవరికీ తెలియదు. ఇంజనీరింగ్ విభాగానికి డ్రెయిన్ల పూడికతీత పర్యవేక్షణ పనులను అప్పచెప్పారు. ఆ పనులు కూడా సిబ్బంది కొరత వల్ల ఆశించిన మేర జరగం లేదు.

### పోస్టింగుల కోసం పైరవీలు..

అధికారుల కొరతతో ఇంజనీరింగ్ విభాగం సతమతమవుతుండగా.. ఉన్న ఏడుగురు ఏఈలు కూడా పోస్టింగుల కోసం కమిషనర్ పులి శ్రీనివాసులపై ఆయా ప్రజాప్రతినిధుల ద్వారా సిఫారసు చేస్తున్నట్లు సమాచారం. ఏఈల్లో కొందరు సిఫార్సులతోనే ఇతర ప్రాంతాల నుంచి గుంటూరు వచ్చారు. ఇక్కడ అంతర్గతంగా మళ్లీ అదే నేతల చేత ఫోన్లు చేయించి పోస్టింగులు కోసం పైరవీలు చేస్తున్నారని తెలిసింది.



## దరఖాస్తుల ఆహ్వానం

పెదకాకాని, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఎంఎస్సీ సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ అండ్ పొల్యూషన్ కంట్రోల్ (వాటర్, ఎనర్జీ, ఆయిల్, గ్యాస్) కోర్సులో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు విభాగాధిపతి ఆచార్య పి.బ్రహ్మాజీరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కోర్సులో ప్రవేశాలు పొందేందుకు బీఎస్సీ, బీటెక్ పూర్తి చేసి ఉండాలని పేర్కొన్నారు. ఆయా కోర్సుల్లో ఏ బ్రాంచ్‌లో ఉత్తీర్ణులైన కూడా అర్హత కల్పిస్తామని తెలిపారు. కోర్స్ ఫీజు రూ.20 వేలుగా నిర్ణయించినట్లు తెలిపారు. వివరాలకు 9441924560 సంప్రదించవచ్చునని చెప్పారు.

## కిలో గంజాయి స్వాధీనం

తెనాలి క్రైం, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక కబేళా సెంటర్ వద్ద గంజాయి కలిగి ఉన్న వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్లు వన్ టౌన్ సీఐ వి.మల్లికార్జునరావు తెలిపారు. ఆదివారం కబేళా సెంటర్ వద్ద నిఘాలో ఉన్న పోలీసులకు అనుమానాస్పదంగా సంచరిస్తున్న గౌడ కాలనీకి చెందిన నీలం సాయితేజను అదుపులోకి తీసుకుని విచారించగా అతని వద్ద 1.35 కిలోల గంజాయి లభించిందన్నారు. ఇతనితోపాటు గంజాయి అమ్మకాలు సాగిస్తున్న ముఠా సభ్యులను కూడా త్వరలో అదుపులోకి తీసుకుంటామన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## బీటెక్ విద్యార్థి మృతదేహం లభ్యం

తెనాలి రూరల్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): స్నేహితులతో వచ్చి కొమ్మమూరు కాలువలో ప్రమాదవశాత్తూపడి గల్లంతైన గుంటూరు కేవీసీ కాలనీకి చెందిన గుంజి రవీంద్ర (20) మృతదేహం ఆదివారం కాకుమాను వద్ద లభించినట్లు రూరల్ పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తెనాలి సమగ్ర వైద్యశాలకి తరలించినట్లు తెలిపారు.

## రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

బొల్లాపల్లి, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): మేళ్ళవాగు శివారు శ్రీ చక్రా ఫ్యాక్టరీ సమీపాన ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కారంపూడి ఆదినారాయణ కాలనీకి చెందిన పేరుబోయిన శివ(23) మృతి చెందాడు. స్థానికుల కథనం మేరకు.. ఆటో కారంపూడి నుంచి మేళ్లవాగు వెళ్తుంది. ఎదురుగా వస్తున్న కారు, ఆటో ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ క్రమంలో ఎదురుగా వస్తున్న మరో ఆటో కారుపైకి దూసుకు వెళ్లడంతో కారులో ఉన్న శివ అక్కడికక్కడే మృతి చెందాడు. ఆటోలో ఉన్న 10 మందికి గాయాలు అయ్యాయి. వైద్యం కోసం నరసరావుపేట తరలించినట్లు ఎస్ఐ ఎ.బాలకృష్ణ తెలిపారు.

## విద్యుదుత్పత్తి నిలిపివేత

రెంటచింతల, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): సాగర్ టెయిల్‌పాండ్ విద్యుత్ ప్రాజెక్టు నుంచి దిగువన ఉన్న పులిచింతలకు ఎగువన ఉన్న సాగర్ నుంచి వచ్చిన నీటిని వచ్చినట్లు విడుదల చేస్తున్నట్లు ఎస్ఈ కె.వెంకటరమణ, ఈఈ సుబ్రహ్మణ్యం ఆదివారం చెప్పారు. ప్రాజెక్టుకు చెందిన 14 గేట్లలో 11 గేట్లను 3 మీటర్లు, 3 రేడియల్ క్రస్ట్‌గేట్లను 4 మీటర్ల మేర ఎత్తి 2,36,818 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నామన్నారు. ఉదయం నుంచి విద్యుత్ ఉత్పత్తిని నిలిపివేశామని అయితే శనివారం అర్ధరాత్రి వరకు 0.9042 ఎంయూల విద్యుత్ తయారైందన్నారు.

# టిప్పర్లు రోడ్డెక్కాలంటే.. ముడుపులు చెల్లించాల్సిందే

- కొందరు బ్రేక్ ఇన్‌స్పెక్టర్ల బలవంతపు వసూళ్లు
- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా నెలకు రూ. 3 కోట్లకు పైనే


పేరేచర్ల ప్రాంతంలో ఓవర్ లోడ్‌తో వెళ్తున్న టిప్పర్

మేడికొండూరు, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లా రవాణా శాఖలో రాబందులు రాజ్యమేలుతున్నాయి. కొందరు అవినీతి అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ప్రధానంగా టిప్పర్లు రోడ్డెక్కాలంటే ముడుపులు చెల్లించాల్సిందే లేదంటే కేసులు, భారీ జరిమానాలతో చెలరేగిపోతున్నారు. అడిగేవాడే లేడన్నట్టుగా రవాణా శాఖలోని కొందరు బ్రేక్ ఇన్‌స్పెక్టర్లు బలవంతపు వసూళ్లకు పాల్పడుతున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా టిప్పర్ల నుంచి నెలకు మూడు కోట్లకు పైగా వసూలు చేస్తున్నారంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. ఉమ్మడి జిల్లాలో దాదాపుగా 4 వందల నుంచి 5 వందల వరకు టిప్పర్లు తిరుగుతున్నాయి. వీటిలో అత్యధికంగా మేడికొండూరు మండలం, పేరేచర్ల నుంచి స్టోన్ క్రషర్ మెటల్ లోడ్ చేసుకొని జిల్లాలోని వివిధ ప్రాంతాలకు వెళ్తుంటాయి. వాహనాల తనిఖీ అధికారులు వివిధ రహదారుల్లో ఆపి డ్రైవర్ లైసెన్స్, పర్మిట్, ఇన్సూరెన్స్, పొల్యూషన్ సర్టిఫికెట్ వంటి పత్రాలతోపాటు అధిక బరువు (ఓవర్‌లోడ్)ను తనిఖీ చేస్తున్నారు. ఎక్కువ శాతం టిప్పర్లకు పత్రాలన్నీ సక్రమంగానే ఉంటాయి. వీరి దృష్టి అంతా ఓవర్‌లోడ్‌పైనే ఉంటుంది. ఈ ఓవర్ లోడ్ తనిఖీ అధికారులకు వరంగా మారింది. నామమాత్రంగా ఓవర్ లోడ్ ఉన్నా భారీ జరిమానాలు విధిస్తున్నారు. అంతేకాకుండా టిప్పర్లను ఆయా ప్రాంత పోలీసు స్టేషన్‌లకు పంపుతుంటారు. జరిమానా చెల్లించి తిరిగి టిప్పర్లను తీసుకెళ్లాలంటే టిప్పర్ యజమానులకు చుక్కలు చూపిస్తారు. కేసులు, జరిమానాలు తాము భరించలేమని టిప్పర్ల యజమానులు మొరపెట్టుకోవడంతో, ప్రతి నెలా ఒక్కో టిప్పర్‌కు నిర్ణీత మొత్తాన్ని చెల్లిస్తే మీపై ఎటువంటి కేసులు రాయమని, ఓవర్ లోడ్‌తో ఉన్నా మీ వైపు కన్నెత్తి చూడమని కొందరు బ్రేక్ ఇన్‌స్పెక్టర్లు చెప్పడంతో ఈ ఒప్పందానికి టిప్పర్ల యాజమాన్యం అంగీకరించి ప్రతి నెలా అధికారులు చెప్పిన విధంగా మధ్యవర్తులకు చెల్లిస్తున్నారు. టిప్పర్ తిరిగినా తిరగక పోయినా నెలవారి కప్పం కట్టాల్సిందే. లేదంటే ఓవర్ లోడ్ జరిమానా విధించడం పరిపాటిగా మారింది. కొన్నేళ్ల క్రితం ప్రారంభమైన నెలవారీ చెల్లింపుల పర్వం నేటికీ నిరాటంకంగా కొనసాగుతుంది. ఏడేళ్ల క్రితం టిప్పర్‌కు రూ.3 వేలు, రూ. 4 వేలు చెల్లించేవారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో ముగ్గురు బ్రేక్ ఇన్‌స్పెక్టర్లు వసూళ్లే లక్ష్యంగా బరితెగించారు. టిప్పర్‌కు రూ.35 వేలు, రూ.40 వేలు ఇస్తేనే తిరుగుతాయని, లేదంటే మూలన పెట్టుకోండని బ్రేక్ ఇన్‌స్పెక్టర్లు హుకుం జారీ చేశారు. ఇంత మొత్తం మేము ఇవ్వలేమని ప్రజాప్రతినిధుల ద్వారా ప్రభుత్వానికి ఫిర్యాదు చేస్తామని టిప్పర్ల యజమానులు చెబితే ఎవరికి చెప్పుకుంటారో చెప్పుకోండని నిర్లక్ష్యంగా చెప్పారని తెలిసింది. ఇక్కడ పోస్టింగ్ కోసం లక్షల్లో చెల్లించామని అవన్నీ సంపాదించుకోవాలి కదా అని అధికారులు తేల్చి చెప్పడంతో చేసేది లేక ప్రతి నెలా ఆమొత్తం చెల్లిస్తున్నారు. ప్రభుత్వం మారినా వీరి ఆగడాలు ఆగకపోవడంతో ఏమి చేయాలో తెలియక టిప్పర్ యాజమానులు ఆవేదన చెందుతున్నారు.

### అధికారులకు వరంగా మారిన జీపీఎస్

ఉమ్మడి గుంటూరు జిల్లాలో తిరుగుతున్న టిప్పర్లకు జీపీఎస్ సౌకర్యం ఉందని చెబుతున్నారు. అధికారులు ఎక్కడ ఉన్నా జీపీఎస్ సౌకర్యంతో టిప్పర్‌లు ఏ రహదారిలో తిరుగుతున్నాయో వారికి తెలిసి పోతుండటం వారికి వరంగా మారింది. ప్రతి నెలా ముడుపులు చెల్లిస్తున్న వారి జాబితాలో లేని టిప్పర్లను జీపీఎస్ ద్వారా గుర్తించి అవి ఉన్న ప్రాంతానికి వెళ్లి కేసులు నమోదు చేస్తున్నారు. బ్రేక్ ఇన్‌స్పెక్టర్ల వద్ద పనిచేసే కానిస్టేబుళ్లను పంపి ప్రతి నెలా ముడుపులు వసూళ్లు చేస్తున్నారు.

### వేధింపులు ఆపండి

అధికారుల వేధింపులు, బలవంతపు వసూళ్లు ఆపాలని ఈ ప్రాంత టిప్పర్ల యాజమాన్యం ప్రభుత్వంలోని ప్రజా ప్రతినిధులతో మొరపెట్టుకుంటున్నారు. ఇసుక రవాణాలో ఓవర్ లోడ్ కేసులు ఎత్తి వేస్తామని సీఎం ప్రకటించిన విషయాన్ని వారు గుర్తు చేస్తున్నారు. రహదారులు దెబ్బతినకుండా ఓవర్ లోడ్ ఆంక్షలు విధించినా అవి ఎక్కడా అమలు కావడం లేదని, అవినీతి అధికారులకు మినహా ఈ ఆంక్షల వల్ల ఉపయోగం లేదని అంటున్నారు. ఓవర్ లోడ్ పరిమితి ఉన్నదాని కన్నా కొంత సడలింపు ఇస్తే గ్రీన్ టాక్స్ రూపంలో ప్రతి నెలా కొంత మొత్తం చెల్లించే విధంగా ప్రభుత్వ పెద్దలు ఆలోచించాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు. దీని వల్ల ప్రభుత్వానికి ఆదాయం సమకూరుతుంది, తమకు అధికారుల వేధింపులు తప్పుతాయని చెబుతున్నారు.

# ఎట్టకేలకు స్కూల్ గ్రాంట్ విడుదలకు గ్రీన్ సిగ్నల్

- మంత్రి లోకేశ్ చొరవతో తీరనున్న నిధుల కొరత
- రెండు విడతల్లో విడుదలకు ఏర్పాట్లు


మున్సిపల్ కార్పొరేషన్ స్కూల్

గుంటూరు(విద్య), అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల నిర్వహణ కోసం స్కూల్ గ్రాంట్ విడుదలకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. విద్యాశాఖ మంత్రి లోకేశ్ చొరవతో త్వరలో స్కూల్ గ్రాంట్ నేరుగా హెచ్ఎంల ఖాతాల్లో జమ కానుంది. ఉమ్మడి జిల్లాలోని జడ్పీ స్కూల్, ప్రభుత్వ, మోడల్ స్కూల్స్, స్కూల్ కాంప్లెక్స్‌లకు మొదటి విడత గ్రాంట్ మంజూరుకు ఏర్పాట్లు పూర్తి అయ్యాయి. రెండు, మూడు రోజుల్లో పాఠశాలల హెచ్ఎంల అకౌంట్స్‌లో నిధులు జమ చేయనున్నట్లు పాఠశాల విద్యాశాఖ నుంచి జిల్లా అధికారులకు సమాచారం అందింది. ఉమ్మడి జిల్లాలో ప్రభుత్వ, జడ్పీ, మోడల్ స్కూల్స్, మండల పరిషత్ స్కూల్స్ దాదాపు 4725పైగా ఉన్నాయి. ఆయా పాఠశాలల్లో దాదాపు 5.35 లక్షల మంది విద్యార్థులు 1 నుంచి 10వ తరగతి వరకు విద్యాభ్యాసం చేస్తున్నారు. స్కూల్ గ్రాంట్ కింద కేంద్ర ప్రభుత్వం నిధులు కేటాయిస్తుంది. దీనికి రాష్ట్ర ప్రభుత్వం మ్యాచింగ్ గ్రాంట్ కలిపి పాఠశాలల హెచ్ఎం అకౌంట్స్‌లో ఏటా జూన్, జులై నెలల్లో జమ చేస్తారు. ఈ నిధులను పాఠశాలల్లో మరుగుదొడ్ల నిర్వహణ, ఎలక్ట్రికల్, స్టేషనరీ, కంప్యూటర్ రిపేర్లు, మంచినీరు వంటి వాటి కోసం వినియోగిస్తారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా రూ.10వేల నుంచి రూ. లక్ష వరకు గ్రాంట్ మంజూరు చేస్తారు.

### గత ప్రభుత్వ నిర్వాకంతో..

ప్రభుత్వ పాఠశాలల నిర్వహణ కోసం గత ప్రభుత్వం 2020లో ఒక్కసారి మాత్రమే నిధులు విడుదల చేసింది. తరువాత నిధులు విడుదల చేయడం నిలిపివేసింది. ఫలితంగా పాఠశాలల నిర్వహణ కష్టతరంగా మారింది. అత్యవసర ఖర్చుల కోసం హెచ్ఎంలు సొంత నిధులు వెచ్చించాల్సిన దుస్థితి.

### నిధులు విడుదలకు చర్యలు హర్షణీయం

పాఠశాలల నిర్వహణ కోసం ప్రభుత్వం నిధులు విడుదలకు చర్యలు తీసుకోవడం హర్షణీయమని ప్రధానోపాధ్యాయుల సంఘం జిల్లా అధ్యక్షులు తిరుమలేష్ పేర్కొన్నారు. నాలుగైదు రోజుల్లో తొలి విడతగా మొత్తం రావాల్సిన నిధుల్లో సగం విడుదల అయ్యే అవకాశం ఉందని, నిధులు నేరుగా హెచ్ఎం అకౌంట్స్‌లో జమ చేస్తారని తెలిపారు. ఈ నిధులు పాఠశాలల్లో ముఖ్యమైన పనుల కోసం వినియోగిస్తామని తెలిపారు.

# చోరీ కేసులో నిందితులు అరెస్టు


సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ నాగేశ్వరరావు, సీఐ ఎంవీ చరణ్, ఎస్ఐలు వంశీకృష్ణ, సమంద్ర వలి

నరసరావుపేట లీగల్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): గంజాయి, మోటారు సైకిల్ చోరీ, బంగారు నగల అపహరణ తదితర కేసుల్లో 8 మంది నిందితులను అరెస్టు చేసినట్లు నరసరావుపేట డీఎస్పీ కె.నాగేశ్వరరావు ఆదివారం తెలిపారు. మొదటి పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. పట్టణానికి చెందిన షేక్ ఖాదర్‌వలి, షేక్ సుభాని, మేరమెట్ల గణేష్‌కుమార్, షేక్ సుభాని అలియాస్ చింతపల్లి సుభాని, సాధినేని అశోక్ కుమార్ గతంలో వివిధ కేసుల్లో నిందితులుగా ఉన్నారు. వీరు గంజాయికి అలవాటు పడి షేక్ అష్రఫ్, షరీఫ్, సాధిక్‌ల సహాయంతో వైజాగ్ నుంచి గంజాయి తీసుకువచ్చి పట్టణంలోని ఎస్ఎస్ఎన్ కళాశాల పక్కన గల శ్మశానవాటికలో దాచినట్లు తెలిపారు. పల్నాడు జిల్లా స్పెషల్ బ్రాంచ్ ఎస్ఐ షేక్ సమంద్ర వలికి వచ్చిన సమాచారం మేరకు ఆయన మొదటి పట్టణ సీఐ ఎంవీ చరణ్, ఎస్ఐ వంశీకృష్ణ, తహసీల్దార్‌ను వెంటపెట్టుకొని సంఘటనా స్థలానికి వెళ్లారు. నిందితులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి ఏడు కిలోల గంజాయి, ఐదు మోటార్ సైకిళ్లు, గంజాయి రవాణాకు వినియోగించిన మూడు మోటారు సైకిళ్లు, ఒక కారును స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ తెలిపారు. వీటి విలువ సుమారు రూ 13.35 లక్షలు ఉంటుందన్నారు. కాగా ఈ కేసులో అసఫ్, షరీఫ్, సాధిక్‌లను అరెస్టు చేయాల్సి ఉందన్నారు.

### ఆభరణాలు చోరీ కేసులో..

శ్రీరామపురంలో ఓ మహిళ వద్ద నుంచి బంగారు నగలను చోరీ చేసిన కేసులో నిందితులైన పశ్చిమ గోదావరి జిల్లా, తాడేపల్లిగూడెం, ఎగర్లపల్లికి చెందిన చాందినీ, సత్యవతి, ముత్యాలమ్మను అరెస్టు చేసినట్లు డీఎస్పీ తెలిపారు. రొంపిచర్ల మండలం కొణకంచివారిపాలెంకు చెందిన పొనుగోటి సంజనాలక్ష్మి పరుసులో ఉన్న బంగారు ఆభరణాలను చోరీ చేసినట్లు తెలిపారు. మళ్లీ ఈ నెల 20న చోరీ చేయడానికి నరసరావుపేట రాగా అరెస్ట్ చేశామని తెలిపారు.

## టైపిస్ట్, స్టెనోగ్రాఫర్స్ రాష్ట్ర కార్యవర్గం ఎన్నిక


నూతనంగా ఎన్నికైన రాష్ట్ర కార్యవర్గం

గుంటూరు సిటీ, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ టైపిస్ట్, స్టెనోగ్రాఫర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడిగా జి.మోహన్ గోపాలకృష్ణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో గుంటూరు జిల్లా అధ్యక్షుడు బి.విజయకుమార్ పర్యవేక్షణలో ఆదివారం అసోసియేషన్ జిల్లాల అధ్యక్షులు, కార్యదర్శులు, సభ్యులు ఈ ఎన్నికలు నిర్వహించారు. కార్యదర్శిగా బీసీ శంకర్ నాయక్, కోశాధికారిగా బి.సురేష్ బాబు, సహాధ్యక్షులుగా ఏసుబాబు, ఉపాధ్యక్షులుగా చెన్నారావు, బి.బ్రహ్మానందరెడ్డి, వి.చంద్రశేఖర్, మహమ్మద్ జాకీర్, కార్యనిర్వాహక కార్యదర్శులుగా ఎస్ఎస్‌కే శర్మ, జి.ప్రాణేశ్వరావు, వి.రామకృష్ణ, కె.మురళి, కార్యదర్శులుగా కె.అరుణ్ కుమార్ మహమ్మద్ అలీ, ఎస్కే నజీర్ అహ్మద్, ఎం.సుధాకర్, క్రీడా కార్యదర్శిగా యు .ప్రవీణ్ కుమార్, మహిళా ప్రతినిదులుగా వాణిశ్రీ, దీప ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారులుగా సీహెచ్ నాగభూషణం, పి.శివరామకృష్ణ వ్యవహరించారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని బొకేలు, పూలమాలలతో సత్కరించారు.

## చలపతి ఫార్మసీ తెలుగు రాష్ట్రాల చెస్ పోటీలు

తాడికొండ, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): లాం చలపతి ఫార్మసీ కళాశాలలో రెండు తెలుగు రాష్ట్రాల చెస్ పోటీలు ఆదివారం ప్రారంభమైయ్యాయి. లాం చలపతి ఫార్మసీ కళాశాల, ఆనంద్ చెస్ వింగ్స్ సంయుక్తంగా ఓపెన్ చెస్ పోటీలను నిర్వహించింది. చెస్ పోటీలను రాష్ట్ర చదరంగం అధ్యక్షులు వి.సత్యనారాయణ, కార్యదర్శి వై.సుమన్ పోటీలు ప్రారంభించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ రెండు తెలుగు రాష్ట్రాల నుంచి 232 మంది క్రీడాకారులు పోటీల్లో పాల్గొన్నారని తెలిపారు. ఏడు రౌండ్లలో పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. పోటీల్లో గెలుపొందిన వారికి రూ.80 వేలు నగదు బహుమతి అందజేస్తున్నట్లు తెలిపారు. చెస్ పోటీలకు మామిడాల గోపినాథ్ ఆర్బిటర్గా వ్యవహరించారు. కార్యక్రమంలో చలపతి ఫార్మసీ కళాశాల ఫిజికల్ డైరెక్టర్ భాను ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.


చెస్ పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు

# ఆవాస్-2024పై ప్రాంతీయ శిక్షణ శిబిరం

- నేడు, రేపు జిల్లాలో నిర్వహణ
- హాజరుకానున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సీనియర్ ఐఏఎస్‌లు

గుంటూరు, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి ఆవాస్ యోజన గ్రామీణ్ కింద ఆవాస్-2024 యాప్‌పై హౌసింగ్ అధికారులు, ఉద్యోగుల్లో సామర్థ్యం పెంచేందుకు ప్రాంతీయ స్థాయి శిక్షణ శిబిరం సోమవారం జరగనుంది. సోమ, మంగళవారంలో జరిగే ఈ ఉన్నతస్థాయి శిక్షణ శిబిరానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సీనియర్ ఐఏఎస్ అధికారులు హాజరు కానున్నారు. గుంటూరు నగరంలోని రింగురోడ్డులో ఉన్న ఐటీసీ వెలకం హోటల్‌లో జరగనున్న ఈ శిక్షణ కార్యక్రమం కోసం గృహనిర్మాణ శాఖ విస్తృత ఏర్పాట్లు చేసింది. మంగళవారం పూర్తిగా క్షేత్ర పరిశీలనకు షెడ్యూల్‌ని కేటాయించారు. కేంద్రంలో నరేంద్ర మోదీ మూడోసారి ప్రధాన మంత్రి అయిన తర్వాత గ్రామీణ ప్రాంతాల్లో కచ్చా ఇళ్లల్లో నివసిస్తున్న వారందరికీ పక్కా ఇళ్లు నిర్మించాలని నిర్ణయించారు. ఇందుకోసం ఆవాస్-2024 కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేసేందుకు అధికారుల్లో సామర్థ్యం పెంచేందుకు శిక్షణ శిబిరాన్ని ఏర్పాటు చేయాల్సిందిగా కేంద్రం నుంచి ఆదేశాలు రావడంతో రాష్ట్ర ప్రభుత్వం గుంటూరుని ఎంపిక చేసింది. సోమవారం ఉదయం 9 నుంచి 9.45 గంటల వరకు రిజిస్ట్రేషన్లు జరుగుతాయి. కేంద్రం, ఎన్ఐసీ, రాష్ట్రాలు, జిల్లాల నుంచి ప్రతినిధులు హాజరు కానున్నారు. అనంతరం ఏపీఎస్‌హెచ్‌సీఎల్ ఎండీ పి.రాజబాబు స్వాగతోపన్యాసం చేస్తారు. ఉదయం 10 నుంచి 10.15 గంటల వరకు వర్కుషాపు నిర్వహణ లక్ష్యం గురించి కేంద్ర ప్రభుత్వ గ్రామీణాభివృద్ధి డిప్యూటీ డైరెక్టర్ జనరల్ జి.ప్రసాద్ వివరిస్తారు. అనంతరం హౌసింగ్ స్పెషల్ చీఫ్ సెక్రెటరీ అజయ్‌జైన్ రాష్ట్రంలో అమలు జరుగుతున్న గృహ నిర్మాణ కార్యక్రమాలపై ప్రసంగిస్తారు. కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సెక్రెటరీ శైలేష్‌కుమార్ సింగ్ కీలకోపన్యాసం చేస్తారు. ఆ తర్వాత రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి, కేంద్ర మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ ప్రసంగిస్తారు. పీఎంఏవై గ్రామీణ్‌పై రాష్ట్ర ప్రభుత్వం పవర్ పాయింట్ ప్రజంటేషన్ సమర్పిస్తుంది. కొత్త నిబంధనలు, పీఎంఏవై గ్రామీణ్, పీఎం-జన్‌మన్ లక్ష్యాలను కేంద్ర ప్రభుత్వ సీనియర్ ఐఏఎస్ అధికారి శక్తికాంత్ సింగ్ చర్చిస్తారు. ఆవాస్-2024 యాప్‌లో జరిగిన సాంకేతిక మార్పులు, ఇళ్ల నిర్మాణంలో వినియోగించాల్సిన బీఐఎస్ సర్టిఫైడ్ సామగ్రి, హడ్కో ప్రజంటేషన్, గ్రామీణ ఇళ్ల నిర్మాణంలో సుస్థిర విధానాలు, తెలంగాణ, ఒడిశా, జార్ఖండ్, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల ప్రజంటేషన్లు జరగనున్నాయి. మంగళవారం గ్రామీణ ప్రాంతాల్లో పర్యటించి పీఎంఏవై గ్రామీణ్ ఇళ్ల నిర్మాణాలను పరిశీలిస్తారు.

## చట్టపరమైన సహాయం అందించడమే లక్ష్యం

- ఏపీ హైకోర్ట్ న్యాయమూర్తి జస్టిస్ రవినాథ్ తిలరి



గుంటూరు(విద్య),అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): ప్రోబోనో క్లబ్ పథకం ద్వారా న్యాయ సేవలను అందించడంలో ఉన్న అంతరాలను తగ్గించి, ప్రజలకు చట్టపరమైన సహాయం అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం, న్యాయవర్గాలు కలిసి పనిచేయాలని ఆంధ్రప్రదేశ్ హైకోర్ట్ న్యాయమూర్తి జస్టిస్ రవినాథ్ తిలరి అన్నారు. వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలోని స్కూల్ ఆఫ్ లా డిపార్ట్‌మెంట్, మినిస్ట్రీ ఆఫ్ లా అండ్ జస్టిస్‌ల సంయుక్త ఆధ్వర్యంలో న్యాయబంధు పథకం కింద "ప్రోబోనో క్లబ్"ను విజ్ఞాన్ యూనివర్సిటీలో ఆదివారం ఘనంగా ప్రారంభించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఏపీ హైకోర్ట్ న్యాయమూర్తి జస్టిస్ రవినాథ్ తిలరి మాట్లాడుతూ ఈ క్లబ్ ప్రారంభం ద్వారా న్యాయ విద్యనభ్యసించే విద్యార్థులు సామాన్య ప్రజలకు, ముఖ్యంగా పేదలకు చట్టపరమైన సహాయం ఉచితంగా అందించడమే లక్ష్యంగా పెట్టుకోవాలన్నారు. కార్యక్రమంలో అమరావతిలోని ఏపీ స్టేట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీ, జిల్లా అండ్ సెషన్స్ జడ్జి ఎం.బబిత, గుంటూరులోని 4వ అడిషనల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జి ఆర్.శరత్ బాబు, ఏపీ స్టేట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ డెప్యూటీ సెక్రటరీ ( సీనియర్ సివిల్ జడ్జి) డాక్టర్ హెచ్.అమర రంగేశ్వరరావు, డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీ పి.లీలావతి, విజ్ఞాన్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య, విజ్ఞాన్స్ వర్సిటీ వైస్ ఛాన్స్‌లర్ కల్నల్, ప్రొఫెసర్ పి.నాగభూషణ్, ఆయా విభాగాల డీన్లు, డైరక్టర్లు, విభాగాధిపతులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## రేపు శ్రీనిలయం ప్రారంభం


బ్రోచర్లు ఆవిష్కరిస్తున్న యర్రా నాగేశ్వరరావు, రమేష్ కృష్ణచంద్ర

గుంటూరు మెడికల్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): అత్యాధునిక వసతులతో, ఆహ్లాదకర వాతావరణంలో సీనియర్ సిటిజన్స్‌కు శ్రీనిలయం పేరుతో సీనియర్ సిటిజన్స్ కంఫర్ట్ హోం, ఫ్యామిలీ రిక్రియేషన్ సెంటర్‌ను అందుబాట్లోకి తీసుకువస్తున్నట్లు కాకతీయ కన్వెన్షన్ సొసైటీ అధ్యక్షుడు డాక్టర్ యర్రా నాగేశ్వరరావు, కార్యదర్శి కొత్తపల్లి రమేష్ కృష్ణచంద్ర తెలిపారు. రాజధాని అమరావతి సమీపంలో మోతడక వద్ద రూ. 30 కోట్ల వ్యయంతో ఏడు అంతస్తులతో నిర్మించిన శ్రీనిలయంను ఈ నెల 22న మాజీ ఉప రాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడు ప్రారంభిస్తున్నట్లు వారు వివరించారు. దీనికి సంబంధించిన బ్రోచర్లను ఆదివారం గుంటూరులో ఆవిష్కరించారు. ప్రవేశాలు నవంబరు నెల నుంచి ప్రారంభిస్తున్నట్లు డాక్టర్ యర్రా నాగేశ్వరరావు, రమేష్ కృష్ణచంద్ర వెల్లడించారు. కోశాధికారి దామచర్ల శ్రీనివాసరావు, సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షులు జీవీ రాయుడు, సభ్యులు ప్రత్తిపాటి సురేష్, కొర్రపాటి రామారావు, గోరంట్ల పున్నయ్య చౌదరి, గంటా పున్నారావు, నాగ మల్లేశ్వరరావు, రావి గోపాలకృష్ణ, నాగార్జున, రవీంద్ర, శ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

## గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఆలపాటి



గుంటూరు, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు, కృష్ణా జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్‌ను తెలుగుదేశం పార్టీ ఖరారు చేసింది. ఆ మేరకు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు ఆదివారం ప్రకటన విడుదల చేశారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో తెలుగుదేశం, జనసేన, బీజేపీ పార్టీలు కూటమిగా ఏర్పడి పోటీ చేయడంతో టీడీపీ ముఖ్య నేతలు కొందరు సీట్లు కోల్పోవాల్సి వచ్చింది. పొత్తులో భాగంగా తెనాలి సీటు జనసేన అభ్యర్థి నాదెండ్ల మనోహర్‌కు దక్కింది. ఆ కారణంగా ఉమ్మడి గుంటూరు జిల్లాలో కీలక నేత, మాజీ మంత్రి, తెనాలి మాజీ ఎమ్మెల్యే అయిన ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ ఆ సీటును త్యాగం చేయాల్సి వచ్చింది. ఈ నేపథ్యంలో పార్టీ అధిష్టానం ఆయనకు ఆ సమయంలో గట్టి హామీ ఇచ్చింది. ఇచ్చిన మాట ప్రకారం ఆయన్ను కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఖరారు చేసింది.

## వ్యక్తిపై ఇసుక మాఫియా దాడి

మంగళగిరి, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): ఇసుక అక్రమ రవాణాకు పాల్పడుతున్న ముఠా ఓ వ్యక్తిపై దాడికి తెగబడింది. సేకరించిన వివరాల ప్రకారం.. మంగళగిరి, తాడేపల్లి ప్రాంతాల్లోని ఇసుక సీనరేజీల్లో కొన్ని శక్తులు అక్రమ రవాణాకు పాల్పడుతున్నాయి. తాడేపల్లికి చెందిన రౌడీషీటర్ హరికృష్ణ, విజయవాడ కృష్ణలంకకు చెందిన రామకృష్ణ ఈ తరహా అక్రమాలకు పాల్పడుతున్నట్టు ఆరోపణలు ఉన్నాయి. ఈ అక్రమ వ్యవహారంపై ఎర్రబాలెం గ్రామానికి చెందిన బెల్లం సురేశ్ అనే వ్యక్తి ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చినట్టు తెలిసింది. దీంతో అక్కసు పెంచుకున్న హరికృష్ణ, రామకృష్ణ ఈ నెల 18వ తేదీ రాత్రి సురేశ్ రామచంద్రాపురం రోడ్డులో ఉన్నట్టు తెలుసుకుని తమ అనుచరులతో కలిసి కార్లలో వెళ్లారు. తమపై అధికారులకు ఫిర్యాదు చేస్తావా అంటూ సురేశ్‌పై విచక్షణారహితంగా దాడి చేశారు. తీవ్రంగా గాయపడిన సురేశ్ మంగళగిరి రూరల్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. సురేశ్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. హరికృష్ణ, రామకృష్ణలను అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచినట్టు రూరల్ ఎస్ఐ చిరుమామిళ్ల వెంకట్ తెలిపారు. నిందితులిద్దరిపైనా మంగళగిరి, తాడేపల్లి పోలీసు స్టేషన్లలో అనేక కేసులు ఉన్నాయని చెప్పారు.

## ప్రకాశం బ్యారేజికి భారీగా వరద నీరు


ప్రకాశం బ్యారేజి దిగువకు విడుదల అవుతున్న వరదనీరు

తాడేపల్లి టౌన్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): ఎగువ ప్రాజెక్టుల నుంచి నీటిని విడుదల చేస్తుండడంతో ప్రకాశం బ్యారేజి వద్ద వరద ఉధృతి భారీగా పెరుగుతోంది. ఎగువన ఉన్న పులిచింతల ప్రాజెక్టు ప్రధాన వాగుల నుంచి 1,62,689 క్యూసెక్కుల వరద నీరు ఆదివారం ప్రకాశం బ్యారేజి వద్దకు చేరుతున్నట్టు నీటిపారుదల శాఖ జేఈ రాజేష్ తెలిపారు. బ్యారేజి రిజర్వాయర్‌లో 12 అడుగుల నీటిమట్టం కొనసాగుతుండగా 20 గేట్లను 4 అడుగులు, 50 గేట్లను 3 అడుగుల మేర ఎత్తి దిగువకు 1,57,250 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. అలాగే తూర్పు డెల్టా కాలువలకు 3923 క్యూసెక్కులు, పశ్చిమ డెల్టా కాలువకు 1516 క్యూసెక్కుల నీటిని వదులుతున్నట్టు జేఈ తెలిపారు. దిగువ నదీతీర ప్రాంతాల వారు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

## 20 క్రస్ట్‌గేట్ల ద్వారా నీటి విడుదల

మాచర్ల రూరల్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్‌కు వరద నీరు పోటెత్తడంతో ప్రాజెక్ట్ అధికారులు ఆదివారం 20 క్రస్ట్‌గేట్లను ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. 14 గేట్లను 5 అడుగులు, 6 గేట్లను 10 అడుగుల మేర ఎత్తి 2,02,404 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. కాగా నాగార్జున సాగర్ నీటి మట్టం 589.60 అడుగులు ఉంది. ఇది 310.84 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 5496 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 6173, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 29,070, 20 క్రస్ట్‌గేట్ల ద్వారా 2,02,404, ఎస్ఎల్‌బీసీ ద్వారా 2400, ఎల్ఎల్‌సీ ద్వారా 400, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్ 2,31,474 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు. కాగా శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్‌కు ఇన్‌ఫ్లో వాటర్‌గా 2,32,110 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

## పులిచింతల సమాచారం

అచ్చంపేట, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): పులిచింతల ప్రాజెక్టులో ఆదివారం 42.16 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్టు పులిచింతల ప్రాజెక్టు ఏఈ రాజు తెలిపారు. ఎగువ నుంచి 2,39,417 క్యూసెక్కుల నీరు ప్రాజెక్టుకు చేరుతుంది. ప్రాజెక్టు వద్ద 2,38,720 క్యూసెక్కుల నీరు దిగువ కృష్ణకు విడుదల అవుతుంది. వీటిలో 16వేల క్యూసెక్కుల నీరు పవర్ జనరేషన్ ద్వారాను, ఏడు గేట్ల ద్వారా విడుదల అవుతున్నాయి.

### నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.15
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

### బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

| | |
|---|---|
| బ్రాయిలర్ బర్డ్ | 135, 145,155 |
| చికెన్ విత్ స్కిన్ | 260.00 |
| చికెన్ స్కిన్ లెస్ | 270.00 |

## మైనార్టీ నేత మృతికి సీఎం సంతాపం

గుంటూరు, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి):గుంటూరు తూర్పు నియోజకవర్గానికి చెందిన టీడీపీ మైనార్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ కరీముల్లా మృతి పట్ల సీఎం చంద్రబాబు సంతాపం తెలిపారు. కింది నుంచి రాష్ట్ర నేతగా ఎదిగారని, పార్టీ కోసం అహర్నిశలు శ్రమించిన ఆయన మృతి చెందడం బాధాకరమని పేర్కొన్నారు. కుటుంబసభ్యులకు సానుభూతి తెలిపారు.

## కలెక్టరేట్ రోడ్డులో నేడు ట్రాఫిక్ ఆంక్షలు

● ఎస్పీ సతీష్‌కుమార్

గుంటూరు, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా సోమవారం ఉదయం 6 గంటల నుంచి 9. 30 గంటల వరకు కలెక్టరేట్ రోడ్డులో ట్రాఫిక్ ఆంక్షలు విధించినట్లు ఎస్పీ సతీష్ కుమార్ తెలిపారు. ఉదయం 6 గంటలకు మొదలై కార్యక్రమం పూర్తయ్యే వరకూ వాహనాల దారి మళ్లింపు ఉంటుందని తెలిపారు. ఈ విషయమై ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు.

**ట్రాఫిక్ దారి మళ్ళింపు వివరాలు..**

పట్టాభిపురం, కంకరగుంట వైపు నుంచి రమేష్ హాస్పటల్ వైపు వెళ్ళు వారు కలెక్టరేట్ జంక్షన్ వద్ద కుడివైపుగా తిరిగి కలెక్టర్ బంగ్లా రోడ్డు మెడికల్ క్లబ్ వైపునకు వెళ్లాలని, రైల్వే స్టేషన్, ఓవర్ బ్రిడ్జి అండర్ పాస్ నుంచి వచ్చే వాహనదారులు కన్నవారితోట రోడ్డులోని వైఎస్సార్ బొమ్మ వద్దనుండి రమేష్ ఆసుపత్రి వైపు గాని, కలెక్టరేట్ రోడ్డు వైపు గాని వెళ్ళాలి. రమేష్ హాస్పిటల్ వైపు నుంచి వచ్చే వాహనదారులు కలెక్టరేట్, పట్టాభిపురం ఫ్లైఓవర్ బ్రిడ్జి వైపు యధావిధిగా వెళ్ళవచ్చు. పోలీసు పెరేడ్ గ్రౌండ్స్ ఎదురుగా ఉన్న కోర్టు లోపలికి వెళ్ళే వారు కోర్టు గేటు నంబర్ 2 నుంచి, ఐటీసీ కార్నర్ వైపు నుండి నగరంపాలెం పోలీస్ స్టేషన్ మీదుగా వచ్చే వాహనదారులు కలెక్టరేట్ ఆఫీస్ రోడ్డు, పట్టాభిపురం ఫ్లైఓవర్ మీదుగా వెళ్లాలి. భారీ వాహనాలకు ఎటువంటి అనుమతి లేదు. అవసరమైతే ఎస్‌బీఐ జంక్షన్ వద్ద ద్విచక్ర వాహనాలు, ఆటోలు, కార్లను కూడా దారి మళ్లించనున్నారు.

## ఉపాధ్యాయులు ఒత్తిడిని అధిగమించాలి

● ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు

గుంటూరు(విద్య),అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలలో పాల్గొని ఉపాధ్యాయులు మానసిక ఒత్తిడిని అధిగమించాలని ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు అన్నారు. ఇటీవల నిర్వహించిన క్రీడల్లో, సాంస్కృతిక పోటీల్లో విజేతలకు ఆదివారం యూటీఎఫ్ కార్యాలయంలో బహుమతులు అందజేశారు. ఎమ్మెల్సీ మాట్లాడుతూ ఉపాధ్యాయులపై పని ఒత్తిడి పెరిగిపోయిందని తద్వారా అనారోగ్యానికి ప్రమాదాలకు గురవుతున్నారని అన్నారు. క్రీడలు,సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా ఒత్తిడిని అధిగమించాలని సూచించారు. రాష్ట్ర అధ్యక్షులు ఎస్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో క్రీడలు సాంస్కృతిక పోటీలు నిర్వహించినట్లు చెప్పారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కెఎస్ఎస్ ప్రసాద్ కార్యక్రమంలో రాష్ట్ర ప్రచురణల కమిటీ ఛైర్మన్ హనుమంతరావు, జిల్లా సహాధ్యక్షుడు జిల్లా సహాధ్యక్షుడు వెంకటేశ్వర్లు,జిల్లా కోశాధికారి గయాసు దౌలా, జిల్లా కార్యదర్శులు ఆదినారాయణ, రాజశేఖరరావు, వెంకటేశ్వరరావు, ఎం. గోవిందయ్య పాల్గొన్నారు.

## అనారోగ్యపు ఆహారపు అలవాట్లే ఇన్‌ఫెక్షన్లకు కారణం

● డాక్టర్ నీరెన్ రావెల

గుంటూరు, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): ప్రస్తుత పరుగుల జీవితంలో అనారోగ్యపు ఆహారపు అలవాట్లే ప్రజల్లో అనేక ఇన్‌ఫెక్షన్లకు కారణమని డాక్టర్ నీరెన్ రావెల పేర్కొన్నారు. స్థానిక అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో ఆదివారం జరిగిన ఆరోగ్య సభలో జనరల్ ఫిజిషియన్ డాక్టర్ నీరెన్ రావెల మాట్లాడుతూ ఇన్‌ఫెక్షన్‌కు కారణం ముఖ్యంగా మనం తీసుకునే ఆహారం, నీరు, మన చుట్టూ ఉన్న వాతావరణం అని అన్నారు. పోషక విలువలు కలిగిన ఆహారం, సరైన సమయంలో తీసుకుంటూ, వారానికి ఐదు రోజులు, రోజుకు 45 నిమిషాల చొప్పున వాకింగ్ లేదా ఇష్టమైన వ్యాయామం చేస్తే వ్యాధి నిరోధక శక్తి పెంపొంది వివిధ రకాల ఇన్‌ఫెక్షన్లు రాకుండా ఉంటాయని తెలిపారు. చాలా సందర్భాల్లో మలేరియా, టైఫాయిడ్ ముఖ్యంగా డెంగీ, చికున్ గున్యా లాంటి జ్వరాలు చూస్తున్నామని, మలేరియా సాధారణంగా రాత్రి పూట కుట్టే దోమల వల్ల వస్తుందని అన్నారు. డెంగీ, చికున్ గున్యా లాంటి వైరస్ వల్ల వచ్చే జబ్బులు సాధారణంగా దోమలు ఉదయం సమయంలో కుట్టడం వల్ల కలుగుతుందని తెలిపారు. మనం నివసించే దగ్గర బురద, నీటి నిల్వ లేకుండా చూసుకోవాలని సూచించారు. సమావేశానికి సాయిరాం కోఆర్డినేటర్ గా వ్యవహరించారు. ఆరోగ్య సభలో రైతు సంఘం నాయకులు బండారు శ్రీనివాస రావు, జనవిజ్ఞాన వేదిక సభ్యులు చలమారెడ్డి, విద్యాధర కుమార్ తదితరులు పాల్గొన్నారు.



## కాకుమానువారితోటలోని జీజీహెచ్ స్థలానికి మూడు రోజుల్లో హద్దులు నిర్ణయించాలి

● జీఎంసీ కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశాలు

గుంటూరు కార్పొరేషన్, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): స్థానిక కాకుమానువారితోటలో ప్రభుత్వ సమగ్ర వైద్యశాలకు కేటాయించిన స్థలాన్ని మూడు రోజుల్లోగా సమగ్ర సర్వే చేసి హద్దులు నిర్ణయించాలని పట్టణ ప్రణాళిక అధికారులను నగర పాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశించారు. కాకుమానువారితోటలోని ఆ స్థలాన్ని ప్రభుత్వ వైద్యశాల సూపరిండెంట్ డాక్టర్ కిరణ్ కుమార్, కేంద్ర ప్రభుత్వ పరిశీలకులు డాక్టర్ రమేష్, జీఎంసీ, సీపీడీసీఎల్ ఇంజినీరింగ్, ప్రజారోగ్య అధికారులతో కలిసి ఆదివారం ఆయన పరిశీలించారు. తొలుత మ్యాప్ ద్వారా మొత్తం ఎంత స్థలం ఉందో, అందులో ఎంత స్థలం జీజీహెచ్‌కు కేటాయించారు, ప్రస్తుతం ఆ స్థలం ఎలా ఉందో ఆయన పరిశీలించారు. కమిషనర్ మాట్లాడుతూ కాకుమానువారితోటలో ప్రభుత్వ వైద్యశాలకు కేటాయించిన 6 ఎకరాల స్థలంలో కొంత మేరకు ఆక్రమణలకు గురైందని, పిచ్చి మొక్కలు పెరిగి ఉందని చెప్పారు. మూడు రోజుల్లో జీఎంసీ పట్టణ ప్రణాళిక అధికారుల నేతృత్వంలో సర్వేయర్లు ఆ స్థలాన్ని సమగ్రంగా సర్వే చేసి హద్దులు నిర్ణయించాలని, ఆక్రమణలను, పిచ్చి మొక్కలను తొలగించేందుకు జాయింట్ యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలని పట్టణ ప్రణాళిక, ప్రజారోగ్య అధికారులకు స్పష్టం చేశారు. సదరు స్థలంలో భవిష్యత్‌లో ఆక్రమణలు జరగకుండా సుమారు రూ. 90 లక్షలతో ప్రహరీ నిర్మాణానికి జీజీహెచ్ చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ప్రభుత్వ వైద్యశాలకు కేటాయించిన స్థలంలో ప్రజారోగ్య కార్మికులు లేదా చుట్టుపక్కల నివాసితులు వ్యర్థాలు, చెత్త వేయకుండా అవగాహన కల్పించాలని సంబంధిత అధికారులను, కార్యదర్శులను ఆదేశించారు. అనంతరం ఇన్నర్ రింగ్ రోడ్డులో ఓసీ కోసం దరఖాస్తు చేసుకున్న బహుళ అంతస్తుల భవనాలను ఆయన పరిశీలించారు. నిబంధనల మేరకు నిర్మాణాలు జరగాలని, సెట్ బ్యాక్‌లో జనరేటర్లు, ఇతర అడ్డంకులు ఉండకూడదని స్పష్టం చేశారు. పర్యటనలో సిటీ ప్లానర్ రాంబాబు, ఎస్.ఈ. నాగమల్లేశ్వరరావు, బయాలజిస్ట్ మధుసూదన్, ఎంహెచ్‌ఓ రామారావు, ఈఈ కోటేశ్వరరావు, సీపీడీసీఎల్ ఈ శ్రీనివాసబాబు, ఏసీపీ ఫజులూర్ రెహ్మాన్, పాల్గొన్నారు.



కాకుమానువారితోటలో స్థల మ్యాపును పరిశీలిస్తున్న కమిషనర్ శ్రీనివాసులు

### ఢిల్లీలో అంతర్జాతీయ వర్క్‌షాప్‌నకు కమిషనర్

గుంటూరు కార్పొరేషన్, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): ఈ నెల 21, 22 తేదీల్లో న్యూ ఢిల్లీలోని అంబేద్కర్ ఇంటర్నేషనల్ సెంటర్‌లో జరగనున్న అంతర్జాతీయ వర్క్ షాప్‌లో నగర కమిషనర్ పులి శ్రీనివాసులు పాల్గొననున్నారు. అర్బన్ ల్యాండ్ రికార్డ్ కోసం సర్వే- రీ సర్వేలో ఆధునిక సాంకేతిక విధానాల అమలుపై ఈ వర్క్‌షాప్ జరగనుంది. కేంద్ర ప్రభుత్వ భూ వనరులు, గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో జరిగే అంతర్జాతీయ వర్క్ షాప్‌లో నేషనల్ జియో స్పేషియల్ నాలెడ్జ్, పట్టణ నివాసాల ఆధారిత భూమి సర్వే (ఎన్ ఏ కె ఎస్ హెచ్ ఏ)లో భాగంగా ఆంధ్రప్రదేశ్‌లో ఎంపికైన కుప్పం, మంగళగిరి-తాడేపల్లి, గుంటూరు, ఒంగోలు, ఏలూరు, కాకినాడ, తిరుపతి, అనంతరపురం మునిసిపాలిటీలు, కార్పోరేషన్ల కమిషనర్లు పాల్గొననున్నారు.

## కోల్డ్‌స్టోరేజ్‌లలో నిల్వల భద్రత యాజమాన్యాలదే

● 'ఆంధ్రజ్యోతి'తో మార్కెటింగ్ జేడీ కె.శ్రీనివాసరావు



గుంటూరు, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): కోల్డ్ స్టోరేజ్‌లలో రైతులు, వ్యాపారస్తులు నిల్వ చేసిన పంట ఉత్పత్తుల భద్రత, వాటి బాధ్యత సంబంధిత యాజమాన్యాలదేనని మార్కెటింగ్ శాఖ జాయింట్ డైరెక్టర్ కాకుమాను శ్రీనివాసరావు స్పష్టం చేశారు. ఇటీవల కాలంలో కోల్డ్‌స్టోరేజ్‌లలో అగ్ని ప్రమాదాలు, రైతుల సరుకుని కమీషన్ వ్యాపారస్తులు, యాజమాన్యాలు కలిసి కుమ్మక్కై అమ్మేస్తుండటంపై జేడీ స్పందించారు. మార్కెట్ కమిటీ లైసెన్సు పొంది కోల్డ్‌స్టోరేజ్ నిర్వహిస్తున్న యాజమాన్యాలు ఒకవేళ సబ్‌లీజుకు ఇవ్వదలిస్తే రిజిష్టర్ లీజ్ అగ్రిమెంట్ చేసుకొని పూర్తి సమాచారాన్ని మార్కెట్ కమిటీకి నివేదించాలని చెప్పారు. సబ్‌లీజుదారు విధిగా మార్కెట్ కమిటీ లైసెన్సు తీసుకొని సహ కరించాలని సూచించారు. రైతులు, వ్యాపారస్తులు కోల్డ్‌స్టోరేజ్‌లో నిల్వ చేసిన తేదీన నిల్వదారుని పేరు, పూర్తి చిరునామా, పరిమాణం, వాహనం నంబరుతో సహా నమోదు చేసి ఒరిజినల్ బాండ్‌ని స్టాకిస్టుకు ఇవ్వాలని తెలిపారు. కోల్డ్‌స్టోరేజ్ ఒరిజినల్ బాండ్‌ను సంబంధిత నిల్వదారునకు మాత్రమే ఇవ్వాలని, అలా కాకుండా వేరే ఇతరులకు ఇవ్వకూడదని. స్టాకిస్టుకు కాకుండా ఇతరులకు ఇస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకొంటామని హెచ్చరించారు. కోల్డ్‌స్టోరేజ్‌లలో నిల్వ ఉన్న సరుకు అమ్మకం సమయంలో కాటా చిట్టాలో నమోదు చేసేందుకు మార్కెట్ కమిటీ లైసెన్సు పొందిన స్టోరేజ్ ఒరిజినల్ బాండ్ నంబరు, రైతు, ఊరు పేరు ఇతర వివరాలు తప్పకుండా ఉండాలన్నారు. వేర్‌హౌసింగ్ డెవలప్‌మెంట్ అండ్ రెగ్యులేషన్ యాక్టు, 2007, అందులోని నిబంధనల కింద జాబితా చేసిన కోల్డ్‌స్టోరేజ్‌లలో మౌలిక సదుపాయాలు, సౌకర్యాల పూర్తి జాబితాను వ్యవసాయ మార్కెట్ కమిటీకి తెలియజేయాలని అన్నారు. శీతలగిడ్డంగిలో నిల్వ ఉన్న సరుకుకు ఎప్పటికప్పుడు పూర్తి వివరాలతో కూడిన బీమా తప్పనిసరిగా చేయించాలని స్పష్టం చేశారు. సరుకు దొంగతనం, అగ్నిప్రమాదం, తుపాను ప్రమాదాలు వంటి వాటికి బీమా వర్తించేలా చేసి నకలును మార్కెట్ కమిటీకి సమర్పించాలని తెలిపారు. కోల్డ్‌స్టోరేజ్‌లో నిల్వ ఉన్న సరుకు నాణ్యత ప్రమాణాలు తగ్గకుండా చూడాల్సిన బాధ్యత యాజమాన్యాలదేనని, ప్రతీ నెల రైతు, వ్యాపారి వారిగా సరుకు నిల్వ వివరాలను మార్కెట్ కమిటీకి నివేదిక రూపంలో ఇవ్వాలని సూచించారు.



'సమన్వయ శ్రీ' పురస్కారం అందుకుంటున్న రచయిత జానీ బాషా

## రచయిత జానీబాషాకు 'సమన్వయశ్రీ' పురస్కారం

గుంటూరు, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): నగ రానికి చెందిన కవి, రచయిత సయ్యద్ జానీ బాషాకు 'సమన్వయశ్రీ' పురస్కారం లభించింది. నెల్లూరులో అఖిల భారతీయ భాషా, సాహిత్య సమ్మేళన్ ఆధ్వర్యంలో 33వ జాతీయ సదస్సు, అవార్డుల ప్రధానోత్సవ సభలో 'సమన్వయశ్రీ' పుర స్కారాన్ని ఆదివారం ఆయన అందుకున్నారు.ఈ అవార్డుల ప్రదానం సభలో ఆ సంస్థ జాతీయ అధ్యక్షులు డాక్టర్ వీరేంద్ర సింగ్, ప్రధాన కార్యదర్శి క్రీతి చతుర్వేది, విక్రమ సింహపురి విశ్వ విద్యాలయ వైస్ ఛాన్సెలర్ ఆచార్య ఎస్ విజయ భాస్కర రావు, డికే ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ డి గిరి, సంస్థ ఆంధ్రప్రదేశ్, తెలంగాణ అధ్యక్షులు డాక్టర్ పెరుగు రామకృష్ణ, ఆచార్య కడారి సత్యమూర్తి తదితరులు పాల్గొన్నారు. ఈ పురస్కారం పొందడం పట్ల కవులు బండికల్లు జమదగ్ని, ఉమామహేశ్వర రెడ్డి, కోసూరి రవికుమార్, ఎస్ఎమ్ సుభాని, తూములూరి రాజేంద్ర ప్రసాద్ అభినందనలు తెలిపారు.



సుభద్రాకృష్ణ, దేవికారాణిలను సత్కరిస్తున్న రావి రంగారావు, కృష్ణమూర్తి తదితరులు

## గొప్ప పద్యకవి చిటిప్రోలు కృష్ణమూర్తి: డాక్టర్ వెంకటరత్నం

గుంటూరు, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం పొందిన చిటిప్రోలు కృష్ణమూర్తి గొప్ప పద్యకవి అని ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ సీహెచ్ వెంకటరత్నం తెలిపారు. స్థానిక బ్రాడీపేట సర్వీస్ హెల్త్ ఆర్గనైజేషన్ సమావేశ మందిరంలో అమరావతి సాహితీమిత్రులు ఆదివారం ఉదయం సాహిత్య సభ నిర్వహించారు. కృష్ణమూర్తి రచించిన పద్య కావ్యం 'పురుషోత్తముడు'లోని పాత్ర చిత్రణపై ప్రసంగించారు. సంస్థ అధ్యక్షుడు డాక్టర్ రావి రంగారావు అధ్యక్షత వహించారు. పురుషోత్తముడు, అలెగ్జాండర్ పాత్రలను గొప్పగా మలిచారని సోదాహరణంగా వివరించారు. కావ్యంలోని వాస్తవిక దృష్టి, నిష్పాక్షిక దృష్టి, ఆత్మదృష్టి గమనించాల్సిన విశేషాలని తెలిపారు. మానవ పాత్రలతో పాటు మానవేతర పాత్రలను కూడా బాగా చిత్రించారని, అందుకే ఈ కావ్యం సాహిత్య అకాడమి బహుమతి పొందిందని గుర్తుచేశారు. దేవికా రాణి రత్నాకర్ (తెనాలి) 'ఈ మాసం కవి'గా పాల్గొని నాన్న', 'పర్యావరణం', 'అవినీతి వ్యతిరేకత'... మొదలైన అంశాలపై కవితలు వినిపించారు. చక్కని జన రంజక గీతాలు పాడి సభను అలరింప జేశారు. పింగళి భాగ్యలక్ష్మి నిర్వహించిన కవి సమ్మేళనంలో 'నిక్కచ్చి కవిత' అం శం 'దీపాలు' గురించి చల్లా సత్యవతి (పిడుగురాళ్ల), కె విజయ సారథి బాబు, గోలి హనుమచ్ఛాస్త్రి, సౌపాటి ప్రభాకర్, మేడిసెట్టి సుభద్రా కృష్ణ, గడల శివ ప్రసాద్, వి వి రావు, ఈవూరి వెంకటరెడ్డి (నరసరావుపేట), షేక్ కాసింబి, కనగాల జయకుమార్, గోలి మధు (మంగళగిరి), షేక్ రహీం సాహెబ్, పూసపాటి కృష్ణ సూర్యకుమార్, మన్నం వెంకట గురువు, బండికల్లు జమదగ్ని తదితర కవులు పాల్గొన్నారు. 'నిక్కచ్చి కవిత' బహుమతి గ్రహీత మేడిసెట్టి సుభద్రా కృష్ణను, 'ఈ మాసం కవి'గా పాల్గొన్న దేవికా రాణిని సత్కరించారు. సంస్థ పక్షాన డాక్టర్ రావి రంగారావు, డాక్టర్ టి సేవ కుమార్, నూతలపాటి తిరుపతయ్య, శాంతా శ్రీమన్నారాయణ, వెంకటరత్నం సత్కరించారు. తొలుత ఇడపలపాటి చంద్రయ్య 'సుభాషితం' సభను బాగా ఆకట్టుకున్నది.



క్రీడాకారిణికి రూ.50 వేల చెక్కును అందజేస్తున్న సామినేని, చుక్కపల్లి రమేష్ తదితరులు

## టేబుల్ టెన్నిస్ క్రీడాకారిణికి ఆర్థిక సాయం

గుంటూరు(తూర్పు), అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): టేబుల్ టెన్నిస్ క్రీడల్లో జాతీయ స్థాయిలో రాణిస్తూ అనేక పతకాలు సాధించిన పల్నాడు జిల్లాలోని శావల్యాపురం మండలం మతుకుమల్లికి చెందిన పాపసాని హాసినికి కమ్మజన సేవాసమితి పాలక వర్గ సభ్యులు రూ.50 వేల ఆర్థిక సాయాన్ని ప్రకటించారు. స్థానిక కుందుల రోడ్డులోని కమ్మబాలికల వసతి గృహంలో ఆమెకు సమితి అధ్యక్ష, కార్యదర్శులు సామినేని కోటేశ్వరరావు, చుక్కపల్లి రమేష్‌లు ఈ చెక్కును అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ భవిష్యత్తులో కూడా హాసినికి చదువు, క్రీడల్లో సహాయ సహకారాలు అందజేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పాలకవర్గ సభ్యులు మర్రిపూడి సీతారామయ్య, రాయపాటి గోపాలకృష్ణ, ఘంటా పున్నారావు, పెద్ది సాంబశివరావు, కన్నెగంటి బుచ్చయ్య, విశ్రాంత ప్రిన్సిపల్ జి వి రాయుడు పాల్గొన్నారు.



షుజాయత్ అలీని అభినందిస్తున్న జియావుద్దీన్ తదితరులు

## అన్ని రంగాల్లో రాణించేలా కొత్త ప్రయోగాలు చేయాలి

● మాజీ ఎమ్మెల్యే జియావుద్దీన్

గుంటూరు, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): నేటి పోటీ ప్రపంచంలో యువత అన్ని రంగాల్లో రాణించేలా కొత్త ప్రయోగాలు చేయాలని డిపార్టుమెంట్ ఆఫ్ హ్యూమన్ రిసోర్స్ మేనేజ్‌మెంట్‌లో డాక్టరేట్ పొందిన ఎండీ షుజాయత్ ఆలీకి మాజీ ఎమ్మెల్యే, రాష్ట్ర మైనార్టీ కమిషన్ మాజీ ఛైర్మన్ ఎస్ఎమ్ జియావుద్దీన్ కోరారు. నగరానికి చెందిన షుజాయత్ అలీకి డిపార్టుమెంట్ ఆఫ్ హ్యూమన్ రిసోర్స్ మేనేజ్‌మెంట్‌లో డాక్టరేట్ లభించడంపై జియావుద్దీన్ అభినందించారు. ఈ సందర్భంగా ఆదివారం జరిగిన ఓ కార్యక్రమంలో ఆయనను శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ షుజాయత్ అలీకి పీహెచ్‌డీ ప్రదానం చేయడం ఆయన ప్రతిభకు తార్కాణమన్నారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత అవకాశాలను ఆయన అందిపుచ్చుకోవాలని ఆకాంక్షించారు.షుజాయత్ అలీ మాట్లాడుతూ గత నెల 28న ఢిల్లీలోని అశోక హోటల్‌లో డాక్టరేట్ అందుకున్నానని, మానవ హక్కుల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాల్సిన అవసరం ఉందని అన్నారు.

## ఆలపాటికి బ్రాహ్మణ సేవా సమితి మద్దతు

గుంటూరు, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): శాసనమండలి కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్‌కు రాష్ట్రీయ బ్రాహ్మణ సేవా సమాఖ్య మద్దతు ప్రకటించింది. సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రామరాజు ఆదివారం ఆలపాటిని కలిసి జ్ఞాపికను అందజేసి మద్దతు తెలిపారు.

## బీటెక్ విద్యార్థి మృతదేహం లభ్యం

తెనాలి రూరల్, అక్టోబరు 20,(ఆంధ్రజ్యోతి): కొమ్మమూరు కాలువలో ప్రమాదవశాత్తు పడి గల్లంతైన గుంజి రవీంద్ర (20) మృతదేహం ఆదివారం కాకుమాను వద్ద లభించినట్లు రూరల్ పోలీసులు తెలిపారు. గుంటూరు కేవీపీ కాలనీకి చెందిన వ్యక్తి రవీంద్ర. మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం జీజీహెచ్ మార్చురీకి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నటు పోలీసులు తెలిపారు.

## అవోపా ఆధ్వర్యంలో పెన్షన్లు పంపిణీ

గుంటూరు(విద్య),అక్టోబరు20(ఆంధ్రజ్యోతి) స్థానిక అరండల్ పేటలోని ఆర్యవైశ్య అఫిషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం 108 మంది పేదలకు పెన్షన్లు, నిత్యావసర వస్తువులు పంపిణీ చేశారు. ప్రముఖ కిడ్నీ వైద్యులు చింతా రామకృష్ణ, చీరాల అవోపా అధ్యక్షులు మురళీ కృష్ణ, 35వ డివిజన్ కార్పొరేటర్ ఈరంటీ వరప్రసాద్ పాల్గొన్నారు. ముఖ్యఅతిథి డాక్టర్ చింతా రామకృష్ణ మాట్లాడుతూ పెన్షనర్లకు అవసరమైన వైద్య సదుపాయాలను ఉచితంగా అందజేస్తామని తెలిపారు. రూ.54000ను పెన్షన్ స్కీంకి అంద జేశారు.

## వరద బాధితులను ఆదుకోండి

గుంటూరు(తూర్పు), అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాల కారణంగా సర్వస్వం కోల్పోయిన ప్రజలను ఆదుకోవాలని వీసీకే పార్టీ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు కే జయసుధ డిమాండ్ చేశారు. వరద బాధితులను ఆదుకోవాలని కోరుతూ ఆదివారం స్థానిక లాడ్జి సెంటర్ వద్ద ధర్నా నిర్వహించారు. బొంగరాలబీడు, శాంతినగర్, కానుమానువారితోట ప్రాంతాల్లో వరదల కారణంగా తీవ్ర నష్టం వాటిల్లిందని, నష్టపరిహారం అంచనా లెక్కించి, తక్షణమే అర్హుల జాబితా తయారు చేసి పరిహారం అందించాలని ఆమె డిమాండ్ చేశారు.



ఆయుర్వేద వైద్య శిబిరంలో ఎమ్మెల్యే గళ్లా మాధవి

## ఆయుర్వేదంతో దీర్ఘకాలిక వ్యాధులు నయం

● పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి వెల్లడి

గుంటూరు మెడికల్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): ఆయుర్వేద వైద్యంతో అనేక రకాలైన దీర్ఘకాలిక వ్యాధులను తగ్గించవచ్చని గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి అన్నారు. శ్రీ వెంకటేశ్వర ఆయుర్వేదిక్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఆదివారం శ్రీనివాసరావుతోటలోని పామ్ స్ప్రింగ్స్ అపార్టుమెంట్‌లో ఏర్పాటు చేసిన ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆయుర్వేదం, పంచ కర్మ వంటి పలు వైద్య విధానాలతో పలు రకాల వ్యాధులను నయం చేయవచ్చని, ఆయుర్వేద వైద్యంపై ప్రజల్లో అవగాహన కల్పిస్తూ ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తున్న డాక్టర్ కొండా వెంకటేశ్వర్లును ఆమె అభినందించారు. డాక్టర్ కొండా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఆయుర్వేదం అమ్మ వంటిదని, ఎటువంటి సైడ్ ఎఫెక్ట్స్ లేకుండా మూలంతో సహా వ్యాధులను నయం చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ రాహుల్, డాక్టర్ ప్రణవి, డాక్టర్ ఐశ్వర్య డాక్టర్ కశ్యప్, మేనేజర్ మల్లేశ్వరి, కేరళ పంచకర్మ థెరపిస్టులు పాల్గొన్నారు.

## ఐకమత్యానికి నిదర్శనం గ్యార్మీ పండగ

గుంటూరు, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): ఐకమత్యానికి గ్యార్మీ పండుగ నిదర్శనమని ఎమ్మెల్యే గళ్లా మాధవి పేర్కొన్నారు. 18వ డివిజన్ మొహిద్దిన్‌పాలెం దర్గా, 29వ డివిజన్ మహబూబ్ నగర్‌లోని జెండా చెట్టు వద్ద గ్యార్మీ పండుగ వేడుకలు కోలాహలంగా జరిగాయి. ముస్లింలతో కలిసి ఎమ్మెల్యే ప్రత్యేక ప్రార్థనలు (దువా) నిర్వహించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మత సామరస్యం పెంపొందించే విధంగా వేడుకలు నిర్వహిస్తున్న నిర్వాహకులను అభినందించారు. ప్రతి ఒక్కరూ మహమ్మద్ ప్రవక్త సూచించిన మార్గంలో నడుచుకోవాలని, ఇతరులపై ప్రేమాభిమానాలు కలిగి ఉండాలన్నారు.

## వైవిధ్య ఉత్పత్తులలో ప్రపంచ అగ్రగామిగా టాటా

● ఆర్థిక నిపుణులు చెరుకూరి కుటుంబరావు

గుంటూరు కార్పొరేషన్, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): ప్రపంచవ్యాప్తంగా 100 దేశాలలో వైవిధ్యం గల వస్తు ఉత్పత్తి చేస్తూ 420 బిలియన్ డాలర్ల వార్షిక ఆదాయంతో ప్రపంచ గుర్తింపు పొందిన వ్యాపార దిగ్గజంగా టాటా గ్రూప్ రూపొందటం అభినందనీయమని ప్రముఖ ఆర్థిక నిపుణులు, ప్రణాళిక సంఘ పూర్వ ఉపాధ్యక్షులు చెరుకూరి కుటుంబరావు పేర్కొన్నారు. ఆదివారం గుంటూరు లోని జన చైతన్య వేదిక హాల్‌లో 'భారత్ ప్రగతిలో టాటాల పాత్ర' అనే అంశంపై చర్చా గోష్టి జరిగింది. తొలుత రతన్ టాటా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ముఖ్యఅతిథి కుటుంబరావు మాట్లాడుతూ భారతదేశంలో 1868లో ప్రారంభించిన టాటా గ్రూప్ దేశానికి ఆర్థిక పునాదులు వేశారని, సంక్షేమం, దాతృత్వాన్ని చాటి చెప్పారని అన్నారు. సభకు అధ్యక్షత వహించిన జన చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి మాట్లాడుతూ విశిష్టసేవలందించిన రతన్ టాటాను 'భారతరత్న'తో గౌరవించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్ మాట్లాడుతూ టాటా సేవలను గుర్తించి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు రతన్ టాటా ఇన్నోవేటివ్ హబ్ ను ప్రకటించడం హర్షణీయమన్నారు. శాసనమండలి సభ్యులు కె.ఎస్. లక్ష్మణరావు మాట్లాడుతూ క్రోనీ కాపిటలిజం నేడు అమలవుతూ ప్రభుత్వ వనరులను, ప్రజల ధనాన్ని లూటీ చేస్తూ వేలాది కోట్లు సంపాదిస్తున్న పాలకులకు, పారిశ్రామిక వేత్తలకు భిన్నంగా టాటా గ్రూప్ దేశభక్తియుతమైన పారిశ్రామికవేత్తలుగా ఉండటం అభినందనీయమన్నారు. మహాత్మా గాంధీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ డీఏఆర్. సుబ్రహ్మణ్యం, మానవత సంస్థ చైర్మన్ పి.రమేష్, నేస్తం సహ వ్యవస్థాపకులు టి. ధనుంజయరెడ్డి మాట్లాడారు.

## మతం.. మనుషుల్ని సంస్కరించాలి

● విరసం సీనియర్ నాయకుడు సీఎస్ ఆర్ ప్రసాద్



మాట్లాడుతున్న సీఎస్ ఆర్ ప్రసాదు, పాల్గొన్న డొక్కా మాణిక్యవర ప్రసాదు

గుంటూరు(తూర్పు), అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): మతాలు మనుషుల్ని సంస్కరించాలే తప్ప ఒక మతంపై మరో మతం దాడులు చేయకూడదని విరసం సీనియర్ నాయకుడు సీఎస్ ఆర్ ప్రసాదు అన్నారు. స్థానిక బ్రాడీ పేట, యూటీఎఫ్ సమావేశ మందిరంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జాషువా పూలే పెరియార్ లిటరేచర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం 'సనాతన ధర్మం - రాజ్యాంగం' అంశంపై సభ జరిగింది. సభకు కవి, జర్నలిస్ట్ బి.విల్సన్ అధ్యక్షత వహించారు. సీఎస్ఆర్ ప్రసాద్ మాట్లాడుతూ సనాతన ధర్మాన్ని ఇప్పుడు రాజ కీయా లకు వాడుకుంటున్నారని విమర్శించారు. మాజీ మంత్రి డొక్కా మాణిక్య వర ప్రసాదు మాట్లాడుతూ కులం అడ్డుగోడలను ధ్వంసం చేసి నూతన సమాజాన్ని నిర్మించాలని కోరారు. సనాతన ధర్మంపై విస్తృత చర్చ జరగాలని సూచించారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాది వెకే , ప్రజా సంఘాల నాయకులు సాధు మాల్యాద్రి, కె.జయసుధ, కె.వినయ్, డి.ప్రభుదాస్, ఇ.రాజశేఖర్ పాల్గొన్నారు.

## యూనియన్ బ్యాంక్ ఆధ్వర్యంలో రిటైల్ లోన్ మేళా



గుంటూరు సిటీ, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): యూనియన్ బ్యాంక్ ఆధ్వర్యంలో గుంటూరు లోని యూనియన్ బ్యాంక్ ప్రాంతీయ కార్యా లయంలో ఆదివారం రిటైల్ లోన్ మేళా నిర్వ హించారు. వ్యక్తిగత, విదేశీ విద్య రుణాలు పొందిన వారికి పత్రాలను అందజేశారు. విదేశీ విద్య కోసం ఒక్కో అభ్యర్థికి రూ. 40 లక్షల వరకు రుణాలు మంజూరు చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ రీజనల్ హెడ్స్ అశ్వర్థ నాయక్, రాజేష్, రిటైల్ లోన్ పాయింట్ హెడ్ డీవీ రామాంజనేయులు పాల్గొని రుణపత్రాలు అందజేసినట్లు లీడ్ బ్యాంక్ మేనేజర్ మహిపాల్ రెడ్డి తెలిపారు.



సముద్రానికి అడ్డుకట్టగా నిలిచిన మడ అడవి

# మడ.. రక్షణ కవచం

## సునామీ, తుఫాన్లను ఎదుర్కొనే శక్తి

- ❖ 2018లో అంతర్జాతీయంగా గుర్తింపు
- ❖ జీవ వైవిధ్యానికి నిలయం మడ అడవులు
- ❖ రేపల్లె తీరంలో అభయారణ్యంగా అభివృద్ధి

తీర ప్రాంతాన్ని సునామీ వంటి ప్రకృతి విపత్తులు నుంచి రక్షించటంతో పాటు తుపాన్ల సమయంలో పెనుగాలుల తీవ్రతను మడ అడవులు తగ్గిస్తాయి. సముద్ర ఆటుపోట్లకు భూమి కోతకు గురికాకుండా కాపాడటంతో పాటు, వన్యప్రాణులకు ఈ మడ అడవులు నెలవుగా ఉంటున్నాయి. ఉవ్వెత్తున్న ఎగసి పడే కడలి కెరటాలను దట్టంగా పెరిగిన మడ అడవులు నిలువరిస్తాయి. తీర ప్రాంతంలోని నేల కోతకు గురి కాకుండా కాపాడతాయి. నేల, నీరు సంగమ స్థలంలో అడవుల్లాగా అభివృద్ధి చెందే మడ చెట్లు రాకాసి సునామీ అలలకు అడ్డుకట్ట వేస్తాయి. దేశంలో అన్ని ప్రాంతాల్లో మడ అడవులు అంతరించిపోతున్న తరుణంలో బాపట్ల జిల్లా పరిధిలోని మడ అడవుల్లో అభయారణ్యంగా అభివృద్ధి చెందాయి.

రేపల్లె, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): జిల్లా పరిధిలోని తీరానికి రక్షణగా మడ అడవులు ఉన్నాయి. బాపట్ల, కృష్ణా, నెల్లూరు, ప్రకాశం, విశాఖ, గోదావరి జిల్లాల్లో మడ అడవులు ఉన్నాయి. కృష్ణా వైల్డ్‌లైఫ్‌లోని బాపట్ల, కృష్ణా జిల్లాలో 25 వేల హెక్టార్లలో 2000సంవత్సరంలో రూ.8 కోట్లతో అటవీ శాఖ ఆధ్వర్యంలో వివిధ జాతుల మొక్కలను నాటారు. అంతర్జాతీయంగా ఎక్కడా పెరగని విధంగా కృష్ణా వైల్డ్ లైఫ్‌లో 19,481 హెక్టార్లలో ఏడు కోట్ల మొక్కలు పెరిగాయి. కృష్ణా వైల్డ్ లైఫ్‌లో ఆరు రిజర్వ్ ఫారెస్టులుగా ఉన్నాయి. బాపట్ల జిల్లా రేపల్లె మండలం లంకెవానిదిబ్బ, మోళ్ళగుంట, లక్ష్మీపురం, నక్షత్రనగర్, కొత్తపాలెం, అడవులదీవి, నిజాంపట్నం, కృష్ణా జిల్లాలోని హంసలదీవి, ఏలిచెట్లదిబ్బ, గుల్లల మోద, నాగాయలంక, సొర్లగొంది, నాచుగుంట ప్రాంతాల్లో మడ మొక్కలు పెరిగాయి. ఇవి పది నుంచి 15 మీటర్ల ఎత్తున పెరిగి దట్టంగా అడవిగా ఏర్పడ్డాయి. లైలా, ఓగ్ని, ఫైలిన్, లెనిన్, నీలం తుఫాన్లకు ఈ మడ అడవులు కారణంగా ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల్లో ఎలాంటి నష్టం సంభవించకుండా అడ్డుగోడగా నిలిచాయి. 2012లో సంభవించిన నీలం తుఫాన్ రేపల్లె మండలం లంకెవానిదిబ్బ సమీపంలోని మడ అడవుల మధ్య చిక్కుకుని బలహీన పడి తీరం దాటిన సంగతి విధితమే. మడ అడవుల కారణంగా వివిధ జీవ వైవిద్య జంతువులకు నిలయంగా ఉంది. భూగర్భ జలాలు కాలుష్యం కాకుండా కాపాడుతుంది. సముద్రం నుంచి వచ్చే ఉప్పు, గాలి, నీటిని అడ్డుకుని మంచినీటిగా మారుస్తుంది. భూమికి సముద్రానికి అనుసంధానంగా ఉంది. సునామీ, తుఫాన్లకు అడ్డుకట్టగా ఉండి నేలను కోతకు గురికాకుండా చేస్తుంది. కార్బన్ కాలుష్యాన్ని మామూలు అడవుల కంటే ఐదు రెట్లు అధికంగా తగ్గించేందుకు దోహదపడుతుంది. మత్స్యసంపద అభివృద్ధికి నిలయంగా ఉంటుంది. అయితే 1972లో మడ అడవులను అప్పటి అధికారులు చెట్ల కొట్టివేతకు వేలం నిర్వహించటంతో మడ అడవులు నరికివేతకు గురయ్యాయి. దీంతో 1977 నవంబరు 19న సంభవించిన తుఫాన్ ప్రభావానికి కృష్ణా జిల్లా దివిసీమ ఉప్పెనలో కొట్టుకుపోయి వేలాది మంది మృత్యువాత పడ్డారు. గుంటూరు జిల్లా లంకెవానిదిబ్బ సమీపంలో మడ అడవులు ఉండటంతో అంత ప్రమాదం సంభవించలేదని అప్పటి రికార్డులు తెలుపుతున్నాయి.

### అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు..

అంతర్జాతీయంగా మడ అడవులు అంతరించిపోతు న్నాయి. అయితే మన తీరప్రాంతంలో 25 వేల హెక్టార్ల భూమి ఉండగా 19,481 ఎకరాల్లో దట్టంగా మడ అడవులు పెరిగాయి. దీంతో రేపల్లె తీర ప్రాంతంలోని మడ అడవులకు అంతర్జాతీయ గుర్తింపు వచ్చింది. దీంతో హైదరాబాద్‌కు చెందిన ఇంటర్నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇన్‌ఫర్మేషన్ టెక్నాలజీకి చెందిన అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ రామచంద్రప్రసాద్, విజయవాడ మేరీ స్టెల్లా కళాశాల బోటనీ డిపార్టుమెంట్‌కు చెం దిన డాక్టర్ ఆశాకుమారి, డాక్టర్ కరుణ మడ అడ వులను 2018లో పరిశీలించారు. మడ అడవుల్లో ఆసియాలోనే ఎక్కువ రకాలు, జాతులు విస్తరిం చి ఉన్నాయి. మన రాష్ట్రంలోని అడవుల్లో మడ అడవులు తొమ్మిది శాతం ఆక్రమించాయి. ఉమ్మడి తూర్పు గోదావరి, కృష్ణా, గుంటూ రు జిల్లాల్లో మాత్రమే ఇవి విస్తరించాయి. మడ అడవుల్లో 24 కుటుంబాలు, 75 జాతులు ఉన్నాయి. వీటిలో అధికసంఖ్యలో వృక్షాలు రైజోఫోరేసి కుటుంబానికి చెందినవి.



కరకట్టకు బలంగా వుండేందుకు వేళ్ళతో కమ్మేసిన మడ మొక్కలు



సముద్రంలో 20 మీటర్ల ఎత్తు పెరిగిన మడ అడవి

---

## అసమానతలు రూపుమాపడమే లక్ష్యం

### ఎమార్పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగ




చేబ్రోలులో ర్యాలీ పాల్గొన్న మందకృష్ణ మాదిగ, ఎమ్మెల్యే నరేంద్రకుమార్

చేబ్రోలు, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): సామాజిక అసమానతలు లేక పోవటమే మహనీయుల లక్ష్యమని ఎమార్పీఎస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణమాదిగ తెలిపారు. ఆదివారం చేబ్రోలు పాతరెడ్డిపాలెంలో జరిగిన డాక్టర్ బీఆర్ అంబేద్కర్, బాబుజగ్జీవన్‌రామ్ విగ్రహాల ఆవిష్కరణలో ఆయన పాల్గొని ప్రసంగించారు. అంబేద్కర్, బాబుజగ్జీవన్‌రామ్‌లు సామాజిక అసమానతలు రూపుమాపటమే లక్ష్యంగా పనిచేశారని కొనియాడారు. అంబేద్కర్ ఆశయ సాధనకు పాటుపడిననాడే నిజమైన నివాళి అన్నారు. జగ్జీవన్ రామ్ ఒక కులానికే పరిమితమైన మహనీయుడు కాదని, స్వాతంత్ర్య సంగ్రామంలో ఆయన పోషించిన పాత్ర ఎనలేనిదన్నారు. ఎమ్మెల్యే నరేంద్రకుమార్ మాట్లాడుతూ అంబేద్కర్ ఆశయ సాధనకు కూటమి ప్రభుత్వం పాటుపడుతుందన్నారు. మహనీయులు చూపిన బాటలో పయనించి వారి ఆశయ సాధనకు పాటుపడదామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో దళిత సంఘాల నాయకులు, స్థానిక యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

---

## పానకాల స్వామి దివ్యక్షేత్రంలో.. నూతన విధానం

- సగానికి తగ్గిన పానకం ధరలు
- బిందె పానకం రూ.30కే
- క్రయ విక్రయాల హక్కులు అక్షయ్‌పాత్ర ఫౌండేషన్‌కు అప్పగింత

మంగళగిరి సిటీ, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): మంగళాద్రి శ్రీలక్ష్మీనృసింహ స్వామి వారి దివ్యక్షేత్రంలో పానకం నూతన ధరలు భక్తులకు అందుబాటులోకి వచ్చాయి. ప్రస్తుతం బిందె పానకం రూ.60లకు విక్రయిస్తుండగా.. నూతన విధానంలో సగం ధరకు అంటే కేవలం రూ.30లకే భక్తులకు అందించనున్నారు. ఇప్పటివరకు కాంట్రాక్టు సంస్థకు పానకం తయారీ, విక్రయ హక్కులను ఇచ్చారు. ఇకపై ఈ హక్కులను అక్షయపాత్ర ఫౌండేషన్‌కు అప్పగిస్తూ దేవదాయ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. సృష్టిలో భక్తులు నివేదించే ప్రసాదాన్ని స్వయంగా ఆరగించే దేవుడు ఒక్క మంగళాద్రి నృసింహుడు మాత్రమే. పానకాల స్వామికి అత్యంత ప్రీతిపాత్రమైన పానకాన్ని భక్తులు నైవేద్యంగా సమర్పిస్తారు. స్వామివారు సగం పానకాన్ని స్వీకరించి మిగతా సగం భక్తులకు ప్రసాదంగా అందిస్తారు. క్షేత్ర ఆచా రాన్ని బట్టి పానకాన్ని ఎగువ సన్నిధిలో తయారు చేసి భక్తులకు బిందెల లెక్కన విక్రయిస్తారు. ఈ విక్రయ హక్కులకు ఏటా టెండరు కం బహిరంగ వేలం నిర్వహిస్తారు. మంగ ళాద్రి క్షేత్రం వార్షిక ఆదాయంలో పానకం వేలం హక్కుల ద్వారా వచ్చే ఆదాయమే సుమారు 20 నుంచి 25 శాతం వరకు ఉంటుంది. గతేడాది పానకం వేలం హక్కుల ద్వారా రూ.కోటి 11 లక్షల ఆదాయం లభించింది. అయితే, పానకం ధరలతోపాటు నాణ్యతపై ఇటీవల కాలం లో అనేక విమర్శలు వ్యక్తమయ్యాయి. ఈ నేపథ్యంలో పానకం తయారీ, విక్రయాల్లో పారదర్శక విధానం తీసుకువచ్చేందుకు మంత్రి నారా లోకేశ్ దేవదాయ శాఖకు పలు సూచనలు చేశారు. దేవదాయశాఖ ఆదేశా లతో ఇప్పటికే దేశ వ్యాపితంగా ఎటువంటి లాభా పేక్ష లేకుండా విద్యార్థులకు మధ్యాహ్న భోజన సేవ లు అందిస్తున్న అక్షయపాత్ర ఫౌండేషన్‌కు పానకం తయారీ, సరఫరా చేసే బాధ్యత లను అప్పగించారు. బిందె పానకం కేవలం రూ.30లకే భక్తులకు అందించాలని నిర్ణయించారు. గత ఏడాది హక్కులను దక్కించు కున్న కాంట్రాక్టు సంస్థ గడువు ఆదివారం ముగియడంతో సోమవారం నుంచి నూతన విధానం అమల్లోకి రానుందని దేవదాయ శాఖ సహాయ కమిష నరు, ఆలయ ఈవో అన్నపురెడ్డి రామ కోటిరెడ్డి తెలిపారు.

ఈ నూతన విధానంలో అక్షయ పాత్ర సంస్థ ద్వారా ఏర్పాటు చేసిన యంత్ర పరికరాలతో బెల్లం, మిరియాలు, పానకం తయారీకి అవసరమైన ఇతర ద్రవ్యాలను జోడించి నిత్యం పానకం తయారు చేయనున్నారు. ప్రతిరోజు ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 3:30 గంటల వరకు భక్తులు పానకాల స్వామికి పానకం సమర్పించేందుకు అవకాశం కల్పిస్తారు. పానకం ధరలను సగానికి తగ్గించడంతో భక్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



శ్రీపానకాల నృసింహస్వామి



మంగళాద్రి క్షేత్రం ఎగువ సన్నిధి

---

## నాగర్‌సోల్ ఎక్స్‌ప్రెస్ పాత షెడ్యూల్‌లోనే

- అస్పష్టతకు తెర దించిన సీపీఆర్‌వో

గుంటూరు, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): వారంలో రెండు రోజుల పాటు గుంటూరు మీదగా నాగర్‌సోల్‌కు వెళుతున్న నరసపూర్ - నాగర్‌సోల్ ఎక్స్‌ప్రెస్ షెడ్యూల్ మార్పుపై నెలకొన్న గందరగోళానికి తెరపడింది. ఈ రైలు ప్రస్తుతం శుక్ర, ఆదివారంలలో ఉదయం 11.15 గంటలకు నరసపూర్‌లో బయలుదేరి మధ్యాహ్నం 3 గంటలకు గుంటూరుకు వస్తుండగా గత శుక్రవారం నుంచి ఉదయం 9.50కి బయలుదేరి మధ్యాహ్నం 1.30కి గుంటూరు, 2.15కి సత్తెనపల్లి, 2.44కి పిడుగురాళ్ల, 3 గంటలకు నడికుడి, రాత్రి 7.50కి సికింద్రాబాద్, మరుసటి రోజు ఉదయం 7.30కి నాగర్‌సోల్‌కి చేరుకొంటుందని దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్‌వో ఏ శ్రీధర్ రెండు రోజుల క్రితం ప్రకటన విడుదల చేశారు. అయితే రైలు మాత్రం పాత సమయపట్టికలోనే ప్రయాణిస్తున్నది. అటు పీఆర్ఎస్, ఇటు ఎన్‌టీఈఎస్‌లోనూ షెడ్యూల్‌ని మార్చలేదు. ప్రయాణికులకు ఫోన్లు చేసి మారిన షెడ్యూల్‌లో రైలు ప్రయాణిస్తుందని కూడా సమాచారం ఇచ్చారు. దాంతో రెండు గంటల ముందుగానే ప్రయాణికులు ఆయా స్టేషన్లకు చేరుకొని ఎదురు చూడగా పాత సమయపట్టికలోనే రావడంతో తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. దీనిపై ఆదివారం రైల్వే శాఖకు ఫిర్యాదులు అందడంతో పాత షెడ్యూల్‌లోనే రైలు ప్రయాణిస్తుందని సీపీఆర్‌వో నుంచి తాజా ప్రకటన జారీ అయింది.

### పల్నాడు, సింహాద్రి ఎక్స్‌ప్రెస్‌లకు తాత్కాలికంగా ఏసీ త్రీటైర్ బోగీ ఏర్పాటు

ఏసీ ఛైర్‌కార్ బోగీ మెయిన్‌టెనెన్స్‌కు వెళ్లిన కారణంగా పల్నాడు, సింహాద్రి ఎక్స్‌ప్రెస్‌లకు కొన్ని రోజుల పాటు ఏసీ త్రీటైర్ బోగీని జత చేసి నడపనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్‌వో ఏ శ్రీధర్ తెలిపారు. పల్నాడు ఎక్స్‌ప్రెస్‌కి ఈ నెల 20, 21, 23, 24, 26, 27 తేదీల్లో, గుంటూరు - విశాఖపట్టణం సింహాద్రి ఎక్స్‌ప్రెస్‌కి ఈ నెల 21, 22, 24, 25, 27, 28, విశాఖపట్టణం - గుంటూరు సింహాద్రి ఎక్స్‌ప్రెస్‌కి ఈ నెల 22, 23, 25, 26, 28, 29 తేదీల్లో ఏసీ ఛైర్‌కార్‌కి బదులుగా ఏసీ త్రీటైర్ బోగీతో నడుపుతామన్నారు.

---

## ఉత్సాహంగా ఏపీఎస్పీఎఫ్ స్పోర్ట్స్ మీట్

వర్సిటీలో అట్టహాసంగా 33వ ఆవిర్భావ దినోత్సవ పోటీలు

సిబ్బందిలో స్నేహపూర్వక సంబంధాల బలోపేతమే లక్ష్యం : ఐజీ వెంకటరామిరెడ్డి

పెదకాకాని(ఏఎన్‌యూ) అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున యూనివర్సిటీ వేదికగా ఆదివారం ఆంధ్రప్రదేశ్ స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ (ఏపీఎస్పీఎఫ్) స్పోర్ట్స్ మీట్-2024 ప్రారంభమైంది. 33వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా నిర్వహిస్తున్న క్రీడలు 23వ తేదీ వరకు నాలుగు రోజుల పాటు కొనసాగనున్నాయి. వివిధ జిల్లాల నుంచి వచ్చిన సిబ్బంది ఉత్సాహంగా ఆయా పోటీల్లో పాల్గొంటున్నారు. క్రికెట్, వాలీబాల్, బ్యాడ్మింటన్, అథ్లెటిక్స్ విభాగాల్లో 202 మంది సిబ్బంది పోటీపడనున్నారు. ఐజీ వెంకటరామిరెడ్డి పోటీలను ప్రారంభించి క్రీడాకారుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా ఐజీ వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ సిబ్బందిలో స్నేహపూర్వక సంబంధాలను బలోపేతం చేసేందుకు స్పోర్ట్స్‌మీట్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శారీరక, మానసిక దృఢత్వాన్ని పెంపొందించడంలో క్రీడలు ఎంతగానో సహాయపడతా యన్నారు. పోటీలు విజయాన్ని మాత్రమే కాకుండా, సమష్టిగా పనిచే యడం, క్రమశిక్షణ, క్రీడాస్ఫూర్తి వంటి విలువలను పెంచుతాయన్నారు. ఏపీఎస్పీఎఫ్ అధినేత డాక్టర్ త్రివిక్రమవర్మ మాట్లాడుతూ సిబ్బందిలో శారీరక, మానసిక దృఢత్వం, క్రీడా స్ఫూర్తిని పెంచేందుకు ఇలాంటి కార్యక్రమాలను ప్రోత్సహిస్తున్నట్లు తెలి పారు. ఈ కార్యక్రమంలో విజయవాడ జోన్ కమాండెంట్ ఎం.శంకర్రావు, అసిస్టెంట్ కమాండెంట్లు కె.కృష్ణమూర్తి, బి.శ్రీనివాసరావు, పి.వి.ఎస్.ఎన్. మల్లికార్జునరావు, టి.కృష్ణమాచారి, కె.శ్రీనివాసులు, టి.కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

**విజేతల వివరాలు:** 100 మీటర్ల పరుగు పందెంలో ఎమ్మెస్ చక్రవర్తి(పీసీ 3452), ఆర్.రంజిత్ కుమార్(పీసీ 5716), ఏ.మహేష్(పీసీ 5872), 400 మీటర్ల పరుగు పందెంలో పి.పెంటయ్య (పీసీ 3978), ఎం.నారాయణరావు(పీసీ 5698), ఏ.మహేష్ (పీసీ 5872) మొదటి మూడు స్థానాల్లో నిలిచారు.



జెండా ఊపి క్రీడలను ప్రారంభిస్తున్న ఐజీ వెంకటరామిరెడ్డి

### బ్యాడ్మింటన్ విజేత బాపట్ల కాలేజి

- వర్సిటీలో ముగిసిన అంతర్ కళాశాల పోటీలు

పెదకాకాని, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యా లయంలో జరుగుతున్న అంతర్ కళాశాలల పురుషుల బ్యాడ్మింటన్ పోటీ లు ఆదివారంతో ముగిశాయి. ఈ పోటీల్లో మొత్తం ఏడు జట్లు పాల్గొనగా విన్నర్‌గా బాపట్ల ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల, రన్నర్‌గా ఆర్‌వీఆర్‌జేసీ కళాశాల నిలిచాయి. తృతీయ బహుమతిని బాపట్ల ఇంజనీరింగ్ కళా శాల సాధించింది. విజేతలకు ప్రిన్సిపాల్ అండ్ ఛైర్మన్ ప్రొఫెసర్ వీరయ్య, ప్రొఫెసర్ టీపీఎస్ పాల్‌కుమార్, ఆర్గనైజేషన్ సెక్రటరి ప్రసన్నకుమార్ బహుమతులు అందజేశారు.



బాపట్ల కళాశాల విద్యార్థులకు బహుమతి అందజేస్తున్న ఛైర్మన్ ఆచార్య కే వీరయ్య, ఆచార్య పీపీఎస్ పాల్‌కుమార్

---

## కుమార్తెను వేధించి ఆస్పత్రిలో వదిలేశారు

- రౌడీషీటరే కారణమంటూ తండ్రి ఫిర్యాదు
- ఆమే ఆసుపత్రికి తీసుకెళ్లమందని యువకుడి తరపు బంధువుల వాదన
- అపస్మారక స్థితిలో తెనాలి యువతి



చికిత్స పొందుతున్న యువతి సహన



తల్లిదండ్రులు ఆరోపిస్తున్న యువకుడు నవీన్

తెనాలి రూరల్, అక్టోబరు 20, (ఆంధ్రజ్యోతి): ప్రైవేటు ఆసుపత్రిలో నర్సుగా పనిచేస్తున్న ఓ యువతి విధులకు వెళ్లిన కొద్దిసేపటికే అపస్మారక స్థితిలో ఆసుపత్రిలో ప్రత్యక్షం కావడం సంచలనం కలిగించింది. అయితే ఈ మిస్టరీపై భిన్నకోణాలు వినిపిస్తుంటే, ప్రస్తుతం ఆమె పరిస్థితి మాత్రం దయనీయంగా ఉంది. వైద్యులు బ్రెయిన్ డెడ్‌గా నిర్ధారించటంతో తల్లిదండ్రులు కన్నీటి పర్యంతమవుతున్నారు. తెనాలికి చెందిన ఎం.సహన(25) అనే యువతి ప్రకాశం రోడ్డులోని ఓ ప్రైవేటు నర్సింగ్ హోమ్‌లో నర్సుగా పని చేస్తుంది. అయితే శనివారం డ్యూటీకి వెళ్లిన ఆమె ప్రభుత్వ ఆసుపత్రిలో అపస్మారకస్థితిలో ఉందని సమాచారం రావటంతో తల్లిదండ్రులు కుమార్తె దగ్గరకు వెళ్లి, పరిస్థితి చూసి చలించిపోయారు. తమ కుమార్తెను కొల్లిపర మండలం వల్లబాపురానికి చెందిన నవీన్ అనే రౌడీషీటర్ నాలుగేళ్లుగా ప్రేమించాలని వేధిస్తున్నాడని, శనివారం అతను మా కుమార్తెను బలవంతంగా కారులో తీసుకెళ్లి, కొట్టి ఆమె అపస్మారక స్థితిలోకి వెళ్లటంతో ఆసుపత్రిలో పడేసి వెళ్లిపోయాడంటూ తండ్రి ప్రసాదరావు టుటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారని సీఐ బాషా చెప్పారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని, నవీన్ కోసం గాలిస్తున్నామని, విచారణ తర్వాత వాస్తవాలు వెల్లడిస్తామని ఆయన పేర్కొన్నారు. అయితే నవీన్ తరపువారు మాత్రం దీనికి భిన్నంగా చెబుతున్నారు. నవీన్, సహన ఇద్దరూ కొన్నేళ్లుగా ప్రేమించుకుటున్నారని, ఆ విషయం ఆమె తల్లిదండ్రులకు కూడా తెలుసని, తరచూ వారు కలుస్తూనే ఉంటారని, శనివారం కూడా పుట్టినరోజు కావటంతో నవీన్‌తో ఆమె ఇష్టపూర్వకంగానే వెళ్లిందని చెబుతున్నారు. ఇద్దరూ కారులో వెళ్తున్న సమయంలో తలనొప్పి రావటం, వాంతులు కావటంతో తనను వెంటనే ఆసుపత్రిలో చేర్పించాలని, తన తల్లిదండ్రులకు సమాచారం అందించాలని ఆమే చెప్పిందనే విషయాన్ని నవీన్ చెప్పాడని బంధువులు చెబుతున్నారు. శనివారం ప్రైవేటు వైద్యశాలకు వెళ్తే పరిస్థితి సీరియస్‌గా ఉందని, బ్రెయిన్ సమస్య ఉందని, పెద్దాసుపత్రికి తీసుకెళ్లాలని సూచించటంతో మంగళగిరి, గుంటూరు ఆసుపత్రులకు తీసుకెళ్లారని, అక్కడ డాక్టర్లు బ్రెయిన్ డెడ్ అని నిర్ధారించారని, దీంతో తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తీసుకువచ్చి, అక్కడి నుంచి తిరిగి గుంటూ రులోని ప్రభుత్వ సమగ్ర వైద్యశాలకు తరలించారని, ఆసు పత్రులకు తీసుకెళ్లే సమయంలో ఆమెతోపాటు తల్లికూడా ఉందంటూ వారు ఆరోపిస్తున్నారు. ప్రస్తుతం ఆమె ప్రభుత్వ వైద్యశాలలో అపస్మారక స్థితిలో ప్రాణాలకోసం పోరాడు తోంది.

### రాజకీయం చేసేందుకు వైసీపీ యత్నం

గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రిలో ఉన్న సహన పరిస్థితిని చూసేందుకు వెళ్లిన వైసీపీ నాయకులు మేరుగ నాగార్జున, అన్నాబత్తుని శివకుమార్ ఆమె తల్లిదండ్రులను పరామర్శించారు. అయితే దీనిపై రాజకీయ ఆరోపణలు చేయటం విమర్శలకు తావిస్తోంది. కూటమి ప్రభుత్వంలో ఆడపిల్లల భద్రత గాలిలో దీపంలా ఉందనీ, దీనికి ప్రభుత్వం బాధ్యత వహించాలంటూ విమర్శలకు దిగారు. రౌడీషీటర్లు రెచ్చిపోతున్నారని, రక్షణ లేకుండా పోయిందని ఆరోపణలకు దిగారు. ఇటు టీడీపీ కూడా ఎదురు దాడికి దిగింది. ఒక యువతి చావుబతుకుల మధ్య ఆసుపత్రిలో ప్రాణాల కోసం పోరాడుతుంటే, ఆ కుటుంబానికి ధైర్యం చెప్పి, వారికి అండగా నిలవాల్సింది పోయి, రాజకీయం చేయటం నీచమంటూ నాయకులు మండిపడ్డారు. సహన కుటుంబానికి అండగా ఉంటామని, వారికి న్యాయం జరిగేలా చూస్తామని పేర్కొన్నారు.

### తెనాలి వాసులకు కలాం అవార్డులు

తెనాలి అర్బన్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): పలు రంగాల్లో సేవలు అందిస్తున్న తెనాలి ప్రముఖులు ఏపీజే అబ్దుల్ కలాం జాతీయ ప్రతిభా పురస్కారం అందుకున్నారు. గుంటూరులో ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణ రావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆదివారం నెహ్రూనికేతన్ స్కూల్ ఎండీ మురళీకాంత్, వి.దాసరి, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయులు వేజళ్ల ఉమామహేశ్వర్, శివనాగేశ్వరరావు, మాంటిస్సోరి ప్రిన్సిపల్ జేమ్స్ మోర్లే, దాత మొవ్వా సత్యనారాయణలు అవార్డులు అందుకున్న వారిలో ఉన్నారు.

### 22న సామూహిక ఎలుకల నివారణ కార్యక్రమం: ఏవో

తెనాలి రూరల్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని రైతుసేవా కేంద్రాల వద్ద ఈ నెల 22న సామూహిక ఎలుకల నివారణ కార్యక్రమాన్ని చేపట్టినట్లు ఏవో ప్రేమసాగర్ ఒక ప్రకటనలో తెలిపారు. అన్నిరైతు సేవా కేంద్రాల్లో మంగళవారం ఉదయం 9 గంటలకు ఎలుకల నివారణకు ఎర మందు తయారు చేయడం జరుగుతుందన్నారు. వరి సాగు చేస్తున్న రైతులు ఈ మందు కోసం నూకలు, నూనె వంటివి వెంట తెచ్చుకుని రైతు సేవాకేంద్రాల్లో సంప్రదిస్తే బ్రోమోడమోలిన్ మందును కలిపి అందించడం జరుగుతుందన్నారు. ఎలుకలు తాకిడి ఉన్న ప్రాంతాల్లో ఆ మందును ఉంచి వాటిని నివారించుకోవచ్చని ఏవో సూచించారు. వరి పైర్లు సాగు చేస్తున్న ప్రతి ఒక్క రైతు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

### టీడీపీ నేత మృతి

చేబ్రోలు, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మంచాల గ్రామానికి చెందిన టీడీపీ నేత ఏకసిరి సుబ్బయ్య ఆదివారం మృతిచెందాడు. ఈ సమాచారం తెలుసుకున్న స్థానిక ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ సుబ్బయ్య మృతదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం సుబయ్య కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి తెలియజేశారు. కార్యక్రమంలో కూటమి పార్టీల నాయకులు పాల్గొన్నారు.

### యూజీసీ టెస్టులో అమర్‌చంద్ర ప్రతిభ

తెనాలి అర్బన్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ నిర్వహించిన నేషనల్ ఎలిజిబిలిటి టెస్టులో పట్టణానికి చెందిన ఆళ్లమూడి అమర్‌చంద్ర ప్రతిభ కనబరిచారు. జూన్ నెలలో నిర్వహించిన పరీక్ష ఫలితాలను యూజీసీ ప్రకటించింది. 89 పర్సంటైల్‌తో అసిస్టెంట్ ప్రొఫెసర్ ఫెలోషిప్ చేసేందుకు అవకాశం లభించింది. అమర్‌చంద్రను తెనాలికి చెందిన పలువురు విద్యావేత్తలు అభినందించారు.

### రోగులకు పండ్లు పంపిణి

పొన్నూరు టౌన్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): నిడుబ్రోలు ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు ఆదివారం టీడీపీ నేతలు మైనార్టీ నేత, మాజీ కౌన్సిలర్ షేక్ జానీ భాషా ఆధ్వర్యంలో పండ్లు, రొట్టెలను పంపిణీ చేశారు. ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ చిన్న కుమార్తె ధూళిపాళ్ళ వైదీప్తి జన్మదినం సందర్భంగా ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు పొట్లూరి హనుమత్ దుర్గాప్రసాద్, గోగినేని సుభాష్, లాడెన్, ఎద్దు శోంబాబు, గుంపుల విజయేంద్ర రావు, ఖాదర్ జానీ, నరసింహా రావు పాల్గొన్నారు.

### దివ్యాంగులకు బస్ పాస్ సౌకర్యం కల్పించాలి

పొన్నూరు టౌన్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగులందరికి బస్‌పాస్ సౌకర్యాన్ని కల్పించాలని పొన్నూరు నియోజకవర్గ వికలాంగుల సంక్షేమ సంఘం నాయకులు ఆదివారం ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్‌ను కలిసి వినతిపత్రం అందచేశారు. దివ్యాంగులైన తమకు సదరం సర్టిఫికెట్లలో వైద్యుల సంతకాలు లేనందువల్ల ఆర్టీసీ బస్ పాస్‌లు ఇవ్వటం లేదని ఆవేదన వ్యక్తం చేసారు. గతంలో టీడీపీ ప్రభుత్వ హయాంలో పింఛను పొందుతున్న ప్రతి దివ్యాంగుడికి బస్‌పాస్‌లు అందించారని గుర్తుచేశారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో బస్ పాస్ సౌకర్యాన్ని తొలగించటంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నామన్నారు. అలాగే ప్రభుత్వం ఏర్పాటుచేసే జన్మభూమి కమిటీలో వికలాంగులను సభ్యులుగా నియమించాలని కోరారు. కార్యక్రమంలో స్థానిక వికలాంగుల సంక్షేమ సంఘం నాయకులు రాంబాబు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

### పట్టభద్రులు ఓటు హక్కు నమోదు చేసుకోవాలి

పొన్నూరు టౌన్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): పొన్నూరు నియోజకవర్గంలోని పట్టుభద్రులైన ప్రతి ఒక్కరూ ఎమ్మెల్సీ ఓటును నమోదు చేసుకోవాలని లగడపాటి వేణుగోపాల్ కోరారు. ఆదివారం పట్టణంలోని ఐలాండ్ సెంటర్‌లో పట్టభద్రుల ఓట్ల నమోదుపై ముద్రించిన కరపత్రాలను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వేణుగోపాల్ మాట్లాడుతూ కృష్ణ, గుంటూరు జిల్లాల ఎమ్మెల్సీ ఎన్నికల్లో తాను స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రైవేటు అధ్యాపకుల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు నన్నపనేని సుశీల్ కుమార్, కరిముల్లా, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

### ఆరుగురు జూదరులు అరెస్టు

కొల్లిపర, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం కొల్లిపరలో ఆరుగురు జూదరులను అరెస్టు చేసినట్లు ఎస్ఐ కోటేశ్వర రావు తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాలు ప్రకారం కొల్లిపర శివారు గుదిబండివారిపాలెంలో ఆరుగురు జూదం ఆడుతున్నట్లు సమాచారం రావటంతో వారిని అదుపులోకి తీసుకుని వారి వద్ద ఉన్న రూ.5వేల 680లను స్వాధీనం చేసుకుని కేసునమోదు చేసినట్లు ఎస్ఐ తెలియజేశారు.

### మున్నంగిలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన

కొల్లిపర, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మున్నంగిలో పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా టీడీపీ సీనియర్ నాయకుడు ఆళ్ళ వీరారెడ్డి స్థానిక కూటమి నాయకులతో కలిసి నూతనంగా నిర్మించనున్న సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఏఈ అవుతు సాంబిరెడ్డి, పంచాయతీ కార్యదర్శి మృత్యుంజయరావు, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.



ఒరిగిన విద్యుత్ స్తంభాలు, పిచ్చిమొక్కలు అల్లుకుని ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ స్తంభం, ట్రాన్స్‌ఫార్మర్

## ప్రమాదకరంగా విద్యుత్ స్తంభాలు

- శలపాడు- సంగంజాగర్లమూడి స్టేషన్ రోడ్డులో ఒరిగిన స్తంభాలు
- ఆ రహదారిపై విద్యార్థులు, వందల మంది రాకపోకలు
- స్పందించకుంటే ప్రమాదకరమే

తెనాలి రూరల్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ స్తంభాలు ఒరిగి ప్రమాదకరంగా మారాయి. నిత్యం వందలాది మంది రాకపోకలు సాగించే చేబ్రోలు మండలం శలపాడు-సంగంజాగర్లమూడి రైల్వేస్టేషన్ రోడ్డులో ఈ పరిస్థితి ఏర్పడింది. శలపాడు నుంచి సంగంజాగర్లమూడి హైస్కూల్‌కు, రైల్వేస్టేషన్‌కు విద్యార్థులు, ప్రయాణికులు అలాగే గుంటూరు నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించే వాటర్ పంప్‌హౌస్‌కు అధికారులు, సిబ్బంది కూడా ఇదే రోడ్డుపై రాకపోకలు సాగిస్తుంటారు. ఆ రోడ్డుకు ఇరుపక్కలా ఉన్న పంటపొలాలకు రైతులు, రైతు కూలీలు వ్యవసాయ పనుల నిమిత్తం వస్తుంటారు. రోడ్డుకు ఒకపక్క కరెంటు స్తంభాలు ఏర్పాటుచేసి వాటికి విద్యుత్ లైట్లు అమర్చారు. అయితే కొన్ని రోజులుగా సంబంధిత శాఖ అధికారులు, సిబ్బంది వీటి నిర్వహణపై పెద్దగా దృష్టిపెట్టడంలేదు. దీంతో వీధిలైట్లు అక్కడక్కడా వెలుగుతుండగా స్తంభాలు కొన్ని పంట పొలాల్లోకి ఒరగగా మరి కొన్ని రోడ్డుపైకి ఒరిగి వంకర టింకరగా ఉంటూ కూలిపోయే పరిస్థితికి వచ్చాయి. స్తంభానికి మధ్య ఉన్న విద్యుత్ వైర్లు సైతం బిగుతుగా మారి ఏక్షణమైనా అవి తెగిపడే ప్రమాదం పొంచి ఉంది. అదేవిధంగా ఆ రోడ్డులో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు పిచ్చి మొక్కలు అల్లుకుని దానిని కప్పివేశాయి. పశువులు మేత మేసేందుకు వెళ్లే క్రమంలో స్తంభానికి అల్లుకున్న గడ్డిజాతి మొక్కలను తినే ప్రయత్నం చేస్తే వాటికి విద్యుత్ షాక్ తగిలి మృతి చెందే అవకాశం పొంచి ఉంది. అదేవిధంగా స్తంభాలకు సైతం తీగజాతి పిచ్చిమొక్కలు అల్లుకుని ఉన్నాయి. ఏమాత్రం వీటిపై నిర్లక్ష్యం వహించినా విద్యుత్‌షాక్‌కు గురై ప్రాణనష్టం జరిగే పరిస్థితి పొంచి ఉంది. ఇప్పటికైనా అధికార యంత్రాంగం వీటిపై దృష్టిపెట్టి ప్రమాదాల బారిన పడకుండా తగిన చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

## తెనాలిలో భారీ వర్షం... రహదారులు జలమయం



భారీ వర్షానికి తెనాలిలో జలమయమైన రహదారులు, బస్టాండ్ ప్రాంగణం

తెనాలి అర్బన్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): తెనాలి పట్టణంలో ఆదివారం మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది. గంటకు పైగా ఏకధాటిగా కురిసిన వర్షంతో పట్టణంలోని పలు పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఆర్టీసీ బస్‌స్టేషన్ ప్రాంగణంలో నీరు నిలిచిపోయింది. గంగానమ్మపేట, కొత్తపేట, బోసురోడ్డుతో పాటు పలు రహదారులు మురుగునీటి కాల్వలతో ఏకం అయ్యాయి. మోకాలిలోతు నీరు ఉండటంతో రాకపోకలకు ఇబ్బందులుపడ్డారు. రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఆదేశాలతో వర్షాకాలానికి ముందు మున్సిపల్ అధికారులు పెద్దఎత్తున మురుగునీటి కాల్వల పూడికలు తీయడంతో కొత్తపేటలోని రహదారులపై నిలిచిన నీరు త్వరితగతిన బయటకు వెళ్లింది. మరికొన్ని ప్రాంతాల్లో పల్లపు రోడ్లలో మధ్యాహ్నం 3గంటల వరకు నీరు నిలబడిపోవడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. మురుగు కాల్వలోని వ్యర్థాలు, బురద రోడ్లపైకి చేరడంతో వీధులు అపరిశుభ్రంగా తయారయ్యాయి. పూలే కాలనీ వద్ద నిర్మిస్తున్న మురుగునీటి శుద్ధి ప్లాంటు నిర్మాణం గత ఐదేళ్లలో నిర్లక్ష్యానికి గురికావడంతో పట్టణ రహదారుల ముంపు సమస్య వీడటం లేదు. ఈ ప్లాంటు పని మొదలైతే భారీ ఇంజన్లు మురుగు నీటిని త్వరితగతిన తోడి ప్లాంటులో శుద్ధిచేసే బావులకు తరలిస్తాయి. పట్టణంలో సింహభాగం వాన నీటిని బయటకు పంపే జంపని డ్రెయిన్ ఆక్రమణలు కారణంగా కుంచించుకుపోవడం, ప్లాస్టిక్ వ్యర్థాలతో మురుగు ప్రవాహానికి ఆటంకం కలిగించడం కూడా రహదారులపై నిలిచిన నీరు త్వరితగతిన బయటకు పోవడం లేదు. జంపని డ్రెయిన్ అభివృద్ధితో పాటు ఆక్రమణలు తొలగించి మురుగునీటి శుద్ధి ప్లాంటు పనులు ప్రారంభిస్తేనే వర్షాలకు రహదారుల ముంపు సమస్యకు పరిష్కారం లభిస్తుంది.



కొల్లిపర, తూములూరులో వర్షానికి జలమయమైన ప్రధాన రహదారి, సిమెంటు రోడ్డు

### కొల్లిపరలో...

కొల్లిపర, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఆదివారం మధ్యాహ్నం ఒక్కసారిగా మబ్బులు కమ్ముకొచ్చి కుంభవృష్టిగా వర్షం పడింది. దీంతో రోడ్లు అన్నీ జలమయమయ్యాయి. మురుగు కాల్వల్లోని నీరు ఎక్కడికక్కడ స్తంభించాయి. ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తుండటంతో జనజీవనానికి అంతరాయం కలిగింది. కొల్లిపరలోని లోతట్టు ప్రాంతాలు, ప్రధాన రహదారులు సైతం నీటితో నిండిపోగా డ్రెయిన్లు పొంగి ప్రవహించాయి. దీంతో మురుగునీరు రోడ్లపైకి చేరడంతో పాదచారులకు, వాహనదారులు పలు ఇబ్బందులకు గురయ్యారు. అదేవిధంగా తూములూరు, దావులూరు, చివలూరు, జెముడుబాడు, దావులూరిపాలెం, మున్నంగి తదితర గ్రామాల్లో ప్రధాన రహదారులు సైతం వర్షం నీటితో నిండిపోయాయి. రహదారులపై గజంలోతు నీరు చేరడంతో వాహనాదారులు పలు ఇబ్బందులు పడ్డారు. నందివెలుగులో రోడ్డు కూడా నీటితో నిండిపోయి గ్రామస్థులు తీవ్ర ఇక్కట్లకు గురయ్యారు.

## కోలాహలంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



ఆత్మీయ సమేళనంలో ఎమ్మెల్యే నరేంద్ర కుమార్‌ను సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు, నేత్రదానం చేసిన 108మంది పూర్వ విద్యార్థులు

పొన్నూరు టౌన్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): పొన్నూరు పట్టణంలోని నిడుబ్రోలు జిల్లా పరిషత్ హైస్కూలు 1982వ బ్యాచ్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం మండల పరిధిలోని చింతలపూడి డీవీసీ కళ్యాణ మండపంలో ఘనంగా నిర్వహించారు. ఈ సమ్మేళనంలో వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన పూర్వ విద్యార్థులు 42 ఏళ్ల తర్వాత కలుసుకుని నాటి జ్ఞాపకాలను మననం చేసుకున్నారు. పూర్వ విద్యార్థులంతా ఏకరూప దుస్తులు ధరించి సందడి చేశారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా వారి సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. అనంతరం మూడు దశాబ్దాల ప్రజా ప్రస్థానం పూర్తిచేసుకుని ఆరుసార్లు పొన్నూరు ఎమ్మెల్యేగా, ఆరుసార్లు సంగం డెయిరీ చైర్మన్‌గా, వివిధ పదవుల్లో సేవలందిస్తున్న తమ సహ విద్యార్థి ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్‌ను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నరేంద్ర కుమార్ ప్రసంగిస్తూ రాజకీయాలు వేరు, స్నేహం వేరని, తాను ఎంత ఎత్తుకు ఎదిగినా తనను చిన్ననాటి మిత్రుడిగానే పరిగణించాలని సూచించారు. అయితే తన రాజకీయ ప్రస్థానంలో పదవులను పొందానని, అలాగే గత ప్రభుత్వ హయాంలో జైలు జీవితాన్ని అనుభవించానన్నారు. జైలు జీవితం కూడా అనేక పాఠాలను నేర్పిందన్నారు. ఆ సమయంలో తనకు మద్దతుగా నిల్చిన మిత్రులందరికి నరేంద్ర కుమార్ ధన్యవాదాలు తెలిపారు.

### 108 మంది పూర్వ విద్యార్థుల నేత్రదానం

ఆత్మీయ సమేళనంలో పాల్గొన్న 108మంది పూర్వ విద్యార్థులు నేత్రదానం చేస్తూ సంతకాలు చేశారు. ఆయా పత్రాలను ఎల్‌వీ ప్రసాద్ కంటి ఆసుపత్రి నిర్వాహకులకు అందచేశారు. ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ తొలిగా నేత్రదానం చేస్తూ తొలి సంతకం చేశారు. అనంతరం నేత్రదానం చేసిన పూర్వ విద్యార్థులను ఎమ్మెల్యే నరేంద్ర కుమార్ అభినందించారు.



సమావేశంలో మాట్లాడుతున్న ప్రచారక్ శంకరరావు

## ప్రపంచ శాంతిని కోరేది హిందూ ధర్మం

● సమరసత సేవా ఫౌండేషన్ జిల్లా ధర్మ ప్రచారక్ హేమశంకరరావు

తెనాలి అర్బన్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): హిందూ ధర్మం ప్రపంచ శాంతిని కోరుతుందని సనాతనమైన ఆ ధర్మాని పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని సమరసత సేవా ఫౌండేషన్ జిల్లా ధర్మ ప్రచారక్ జంజనం హేమశంకరరావు చెప్పారు. హిందూ ధర్మరక్షణ గ్రామ కన్వీనర్ల బాధ్యత అనే అంశంపై ఆదివారం బోసురోడ్డులోని శ్రీవాసవీ ఆలయంలో శిక్షణ తరగతులు నిర్వహించారు. ఖండ ప్రముఖ్ కడియాల సునీల్‌కుమార్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, సనాతనమైన హిందూ ధర్మం అత్యుత్తమ గ్రంథమైన భగవద్గీత మానవాళికి మార్గదర్శకమన్నారు. మానవజాతి మనుగడను, నడవడికను కుటుంబ వ్యవస్థ బలోపేతం చేసేందుకు రామాయణ కావ్యం దోహదపడుతుందన్నారు. హిందూ ధర్మం పరిరక్షించేందుకు కన్వీనర్ కృషి చేయాలని కోరారు. హనుమత్ ప్రసాద్, అప్పికట్ల వెంకటేశ్వరరావు, వజుల సునీత, రామాంజనేయులు, పవన్, రవికుమార్, బాలచంద్రమౌళి పాల్గొన్నారు.

## సమాజానికి మానవత్వం ఉన్న వ్యక్తులు అవసరం

● మానసిక నిపుణుడు సుబ్బారావు

తెనాలి అర్బన్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): నేటి సమాజంలో రుగ్మతలను నివారించేందుకు మానవత్వం ఉన్న వ్యక్తుల అవసరం చాలా ఉందని మానసిక నిపుణులు ప్రత్యూష సుబ్బారావు చెప్పారు. స్వచ్ఛంద సేవా సంస్థ మానవతా సమావేశం ఆదివారం ఏఎస్ఎన్ డిగ్రీ కళాశాలలో నిర్వహించారు. సభ్యులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ, పిల్లలు, యువతలో నైతిక విలువలను పెంపొందించడంలో తల్లిదండ్రులు, పాఠశాలలు, పెద్దలు ప్రముఖ పాత్ర పోషించాలన్నారు. రీజనల్ చైర్మన్ కొత్త సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ సభ్యత్వం సంఖ్యను పెంచేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. చైర్మన్ కొలసాని రాంచంద్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో మొవ్వా హేమంత్‌కుమార్ సహకారంతో మెడిసిన్ చదువుతున్న షేక్ బాబా షరీఫ్‌కు రూ.55 వేల ఆర్థిక సాయం అందజేశారు. తొలుత దాత, పారిశ్రామిక వేత్త రతన్‌టాటా మృతికి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఓంకార ప్రసాద్, శ్రీనివాసబాబు, వెంకట్, వాసు, సోమయ్య శాస్త్రి, శర్మ తదితరులు పాల్గొన్నారు.



సుబ్బారావును సన్మానిస్తున్న సంఘం సభ్యులు



అంగలకుదురులో శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి మనోహర్, పక్కన మురళి, రాజ్యలక్ష్మి, నాగభూషణం తదితరులు

## గ్రామాలను తీర్చిదిద్దుతాం

మంత్రి నాదెండ్ల మనోహర్

తెనాలి రూరల్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ప్రతి గ్రామాన్ని తీర్చిదిద్దుతామని రాష్ట్ర పౌర సరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా ఆదివారం మండలంలోని ఖాజీపేట, కొలకలూరు, ఎరుకలపూడి, కఠెవరం, సంగంజాగర్లమూడి, అంగలకుదురు, మల్లెపాడు, జగ్గడిగుంటపాలెం తదితర గ్రామాల్లో సుమారు రూ.81లక్షలతో తలపెట్టిన పలు అభివృద్ధి పనులకు మంత్రి మనోహర్ ముఖ్య అతిథిగా హాజరై శిలాఫలకాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మనోహర్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా పల్లెపండుగ ద్వారా అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టామన్నారు. అందులో భాగంగా తెనాలి నియోజకవర్గంలో రూ.2 కోట్ల 55 లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణం చేయబోతున్నామన్నారు. రాబోయే రోజుల్లో మరో రూ.50 లక్షలతో మిగిలిన వాటిని కూడా తీర్చిదిద్దటం జరుగుతుందన్నారు. గత వైసీపీ ప్రభుత్వం అభివృద్ధిపై దృష్టిపెట్టలేదన్నారు. ఫలితంగానే నేడు ఇంత దారుణమైన పరిస్థితుల్లో రోడ్లు తయారయ్యాయని ఆరోపించారు. రాబోయే రోజుల్లో వాటి మరమ్మతులు చేపట్టడం జరుగుతుందన్నారు. రాష్ట్ర ఖజానాను వైసీపీ ఏ విధంగా ఖర్చు చేసిందో ప్రజలందరికీ తెలిసిన విషయమేనన్నారు. ప్రజలకు మంచి చేసేందుకు ఎక్కడా రాజీపడకుండా కూటమి ప్రభుత్వపాలన ఉంటుందని మంత్రి మనోహర్ స్పష్టం చేశారు. కార్యక్రమంలో పలు శాఖల అధికారులు ఆయా గ్రామాల సర్పంచ్‌లు, వార్డు మెంబర్లు, కూటమి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

### గ్రామాల్లో పర్యటించిన మనోహర్

తెనాలి రూరల్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): పల్లెపండుగ కార్యక్రమం ద్వారా గ్రామాల్లో పర్యటించిన మంత్రి మనోహర్ గ్రామస్థుల యోగక్షేమాలను విచారించారు. పంచాయతీ వారోత్సవాల్లో భాగంగా ఆదివారం మంత్రి మనోహర్ పలు గ్రామాలను సందర్శించారు. ఈ సందర్భంగా మనోహర్‌ను పలువురు గ్రామస్థులు కలిసి పింఛన్లు, రేషన్ కార్డులు, నివేశన స్థలాలు, శ్మశాన వాటికకు స్థలం వంటి పలు సమస్యలను విన్నవించారు. కార్యక్రమంలో జనసేన నాయకులు గాదె వెంకటేశ్వర్లు, గణేష్‌యూత్ కన్వీనర్ వీరవల్లి మురళి, కనగాల నాగభూషణం, పలు శాఖల అధికారులు, కూటమి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## రూ.6.85 లక్షల బోనస్ పంపిణీ



రైతులకు బోనస్ పంపిణీ చేస్తున్న సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్

పొన్నూరు టౌన్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): 116 మంది పాల రైతులకు 6.85లక్షల బోనస్‌ను పంపిణీ చేసినట్లు పొన్నూరు ఎమ్మెల్యే, సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ తెలిపారు. మండల పరిధిలోని చింతలపూడిలో ఆదివారం నిర్వహించిన బోనస్‌ల పంపిణీ కార్యక్రమానికి ఎమ్మెల్యే నరేంద్రకుమార్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా చైర్మన్ నరేంద్ర కుమార్ మాట్లాడుతూ గతేడాది సంగం డెయిరీ పరిధిలోని చింతలపూడి పాల సొసైటీ 116మంది రైతుల నుంచి 1,44,942 లీటర్ల పాలను సేకరించినట్లు తెలిపారు. రైతులకు చెల్లించిన ధరతో పాటు రూ.4లను అదనంగా బోనస్ రూపంలో అందించినట్లు తెలిపారు. డీవీసీ అభయ ద్వారా రైతుల పశువులకు బీమా సౌకర్యాన్ని అందించినట్లు తెలిపారు. పాల రైతులకు అవసరమైన దోమ తెరలను సబ్సిడీపై అందిస్తున్నామన్నారు. సంగం డెయిరీ అమలు చేసే సంక్షేమ పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సంగం పాలకవర్గ సభ్యులు బొర్రు రామారావు, చిల్లింగ్ సెంటర్ మేనేజర్ కాట్ర నరేష్‌బాబు, మాజీ సర్పంచ్‌లు గంటా ప్రసాద్, ధూళిపాళ్ళ రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు. అలాగే ఇటీవల మృతిచెందిన పాల రైతు శాయన వెంకటేశ్వర్లు కుటుంబ సభ్యులకు డీవీసీ అభయ ద్వారా రూ.50 వేల పరిహార నగదు, మట్టి ఖర్చులకుగాను రూ.10 వేలను మృతుడి భార్య వెంకట సుబ్బమ్మకు చైర్మన్ నరేంద్ర కుమార్ అందచేశారు.



బాధితురాలికి ఆర్థికసాయం అందిస్తున్న స్వచ్ఛంద సేవాసంస్థ సభ్యులు

## అనారోగ్య బాధితురాలికి ఆర్థికసాయం

తెనాలి, మారీసుపేట, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో బాధపడుతున్న బాధితురాలికి ఆర్థికసాయాన్ని నందివెలుగు భరోసా స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు ఆదివారం అందించారు. మండల పరిధిలోని కొలకలూరు గ్రామంలో నివసించే నలుకుర్తి స్వీటీ 20 సంవత్సరాలుగా గుండెజబ్బుతో బాధపడుతోంది. ఆమెకు వైద్య ఖర్చుల నిమిత్తం నందివెలుగు భరోసా స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు రూ.13 వేలను ఆర్థికసాయంగా అందించారు. ఈ కార్యక్రమంలో సేవా సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

## మహిళలకు ఉచిత ప్రయాణం హామీని అమలు చేయాలి

● జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు చిలకా విజయ్ కుమార్

పొన్నూరు టౌన్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ పథకాన్ని తక్షణమే అమలు చేయాలని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు చిలకా విజయ్‌కుమార్ డిమాండ్ చేశారు. ఈ విషయంపై ఆదివారం పొన్నూరు పట్టణంలో కాంగ్రెస్ పార్టీ నేతలు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా విజయ్ కుమార్ మాట్లాడుతూ కర్నాటక, తెలంగాణ రాష్ట్రాల్లో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఏర్పడిన నెల రోజుల్లోనే ఉచిత ప్రయాణం పథకాన్ని అమలు చేసినట్లు గుర్తు చేశారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి నాలుగు నెలలు దాటినప్పటికి ఇంకా ఈ పథకం అమలు చేయకపోవటం సరి కాదన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ ఇన్‌చార్జి జక్కా రవీంద్రనాద్, చల్లికొండ రవిబాబు, మండవనేని కోటయ్య, కంతేటి యలమంద, అందే దిలీప్, బిలా సునీల్, బీ బ్రహ్మయ్య, రేవంత్, గిరీష్ తదితరులు పాల్గొన్నారు.

## అలరించిన బాలయ్య సినీ గీతాలు

తెనాలి అర్బన్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): సినీనటుడు నందమూరి బాలకృష్ణ సినీ స్వర్ణోత్సవం పురస్కరించుకుని నిర్వహించిన సంగీత కచేరి అలరించింది. తెనాలి రామకృష్ణ కవి కళాక్షేత్రంలో ఆదివారం స్వరలయ వేదిక ఆధ్వర్యంలో సంగీత విభావరి నిర్వహించారు. పలువురు గాయకులు బాలకృష్ణ నటించిన పలు సినిమాలకు చెందిన పాటలను ఆలపించారు. వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు సాయి లక్కరాజు తదితరులు పర్యవేక్షించారు.

### నీరుకొండలో విద్యుత్ సరఫరాకు అంతరాయం

మంగళగిరి, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి మండలం నీరుకొండలో 132 కేవీ లైన్ నూతన కండక్టర్ అమర్చే పనుల్లో భాగంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని డీఈఈ సురేష్‌బాబు తెలిపారు. సోమవారం నుంచి బుధవారం వరకు ఉదయం 7 నుంచి సాయంత్రం 5గంటల వరకు పలుమార్లు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందన్నారు.

### పశ్చిమ డెల్టా కాల్వకు 1516 క్యూసెక్కులు

దుగ్గిరాల, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): ప్రకాశం బ్యారేజి నుంచి పశ్చిమ డెల్టాకాల్వకు 1516 క్యూసెక్కుల సాగునీటిని ఆదివారం విడుదల చేసినట్లు నీటిపారుదలశాఖ అధికారులు తెలిపారు. బ్యారేజి వద్ద 12.0 అడుగుల నీటిమట్టం ఉండగా, దిగువకు 1,45,250 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. కాగా దుగ్గిరాల సబ్‌డివిజన్ నుంచి రేపల్లె కాల్వకు 513 క్యూసెక్కులు, తూర్పుకాల్వకు 82 క్యూసెక్కులు, కొమ్మమూరుకాల్వకు 1217 క్యూసెక్కుల నీరు, విడుదల చేస్తున్నారు.

### అభివృద్ధి పనులకు నేడు శంకుస్థాపన

ప్రత్తిపాడు, అక్టోబరు, 20 (ఆంధ్రజ్యోతి) : పల్లెపండుగ పంచాయతీ వారోత్సవాల్లో భాగంగా ప్రత్తిపాడులో సోమవారం పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనున్నట్లు టీడీపీ మండల అధ్యక్షుడు గింజుపల్లి శివరామప్రసాద్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు, మాజీ మంత్రి మాకినేని పెదరత్తయ్య విచ్చేయనున్నట్లు తెలిపారు. తొలుత కోయవారిపాలెంలో ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరించి ర్యాలీగా ప్రత్తిపాడుకు వచ్చి సీసీ రోడ్లు, డ్రెయిన్లు నిర్మాణాలకు భూమి పూజచేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

### వివాహిత ఆత్మహత్యాయత్నం

దుగ్గిరాల, అక్టోబరు 20: ఎలుక మందు తిని వివాహిత ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. దుగ్గిరాలకు చెందిన కట్టా నాగరాజు, అదేగ్రామానికి చెందిన వివాహిత శ్రావణి తరచూ ఫోన్‌చేసి వేధిస్తుండటంతో ఈనెల 17వతేదీ సాయంత్రం ఎలుకల మందు తిని ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. తరచూ ఫోన్ చేస్తున్నాడని, భర్త రాజశేఖర్, పెద్దల దృష్టికి తీసుకెళ్లి హెచ్చరించినప్పటికీ ఫలితం లేకపోయింది. దీంతో శ్రావణి అతడి ఇంటికెళ్లి ప్రశ్నించగా ఎదురు దాడికి దిగడంతో మనస్థాపానికి గురై ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ప్రస్తుతం తెనాలి ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్న శ్రావణి, ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఎస్ వెంకటరవి తెలిపారు.

### మతం.. మనుషుల్ని సంస్కరించాలి

విరసం నాయకుడు సీఎస్ఆర్ ప్రసాద్



మాట్లాడుతున్న సీఎస్ ఆర్ ప్రసాదు

గుంటూరు(తూర్పు), అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): మతాలు మనుషుల్ని సంస్కరించాలే తప్ప ఒక మతంపై మరో మతం దాడులు చేయకూడదని విరసం సీనియర్ నాయకుడు సీఎస్ఆర్ ప్రసాదు అన్నారు. స్థానిక బ్రాడీపేట, యూటీఎఫ్ సమావేశ మందిరంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జ్యోతిరావు పూలే పెరియార్ లిటరేచర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం 'సనాతన ధర్మం - రాజ్యాంగం' అంశంపై సభ జరిగింది. సభకు కవి, జర్నలిస్ట్ బి. విల్సన్ అధ్యక్షత వహించారు. సీఎస్ఆర్ మాట్లాడుతూ సనాతన ధర్మాన్ని ఇప్పుడు రాజకీయాలకు వాడుకుంటున్నారని విమర్శించారు. మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాదు మాట్లాడుతూ కులం అడ్డుగోడలను ధ్వంసం చేసి నూతన సమాజాన్ని నిర్మించాలని కోరారు. సనాతన ధర్మంపై విస్తృత చర్చ జరగాలని సూచించారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాది వెకే, ప్రజా సంఘాల నాయకులు సాధు మాల్యాద్రి, కె.జయసుధ, కె.వినయ్, డి.ప్రభుదాస్, ఇ.రాజశేఖర్ పాల్గొన్నారు.

### కలెక్టరేట్ రోడ్డులో నేడు ట్రాఫిక్ ఆంక్షలు

● ఎస్పీ సతీష్‌కుమార్

గుంటూరు, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా సోమవారం ఉదయం 6 నుంచి 9.30 గంటల వరకు కలెక్టరేట్ రోడ్డులో ట్రాఫిక్ ఆంక్షలు విధించినట్లు ఎస్పీ సతీష్‌కుమార్ తెలిపారు. ఉదయం 6 గంటలకు మొదలై కార్యక్రమం పూర్తయ్యేవరకు వాహనాల దారి మళ్లింపు ఉంటుందని తెలిపారు. ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు.

**దారి మళ్లింపు వివరాలు..**

పట్టాభిపురం, కంకరగుంట వైపు నుంచి రమేష్ హాస్పిటల్ వైపు వెళ్ళు వారు కలెక్టరేట్ జంక్షన్ వద్ద కుడివైపుగా తిరిగి కలెక్టర్ బంగ్లా రోడ్డు మెడికల్ క్లబ్ వైపునకు వెళ్లాలని, రైల్వే స్టేషన్, ఓవర్ బ్రిడ్జి అండర్ పాస్ నుంచి వచ్చే వాహనదారులు కన్నవారితోట రోడ్డులోని వైఎస్సార్ బొమ్మ నుంచి రమేష్ ఆస్పత్రి వైపు గాని, కలెక్టరేట్ రోడ్డు వైపు గాని వెళ్లాలి. రమేష్ హాస్పిటల్ వైపు నుంచి వచ్చే వాహనదారులు కలెక్టరేట్, పట్టాభిపురం ఫ్లైఓవర్ బ్రిడ్జి వైపు యథావిధిగా వెళ్లవచ్చు. పోలీసు పెరేడ్ గ్రౌండ్స్ ఎదురుగా ఉన్న కోర్టు లోపలికి వెళ్ళే వారు కోర్టు గేటు నంబర్ 2 నుంచి, ఐటీసీ కార్నర్ వైపు నుంచి నగరంపాలెం పోలీస్ స్టేషన్ మీదుగా వచ్చే వాహనదారులు కలెక్టరేట్ ఆఫీస్ రోడ్డు, పట్టాభిపురం ఫ్లైఓవర్ మీదుగా వెళ్లాలి. భారీ వాహనాలకు ఎటువంటి అనుమతి లేదు.

## పంట కాల్వలు ఆక్రమించి తూముల ఏర్పాటు

- పర్మిషన్లు లేకుండానే తూముల నిర్మాణాలు
- కన్నెత్తి చూడని అధికారులు
- ఒకరిపై ఒకరు చెప్పుకుంటున్న ఇరిగేషన్, ఎన్ఎస్‌పీ అధికారులు





ఎంపీడీవో కార్యాలయం ఎదురు పంటకాల్వలో, లాం-దామరపల్లి రోడ్డులో పంటకాల్వని ఆక్రమించి వేసిన తూములు

తాడికొండ, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావటంతో రియల్ ఎస్టేట్ రంగం పుంజుకుంది. నియోజకవర్గంలో రాజధాని ఉండటంతో తాడికొండ చుట్టు పక్కల గ్రామాల్లో రియల్ వ్యాపారం జోరుగా సాగుతోంది. దీంతో ఇబ్బడి ముబ్బడిగా రియల్ వెంచర్ల వెలిశాయి. ఎలాంటి పర్మిషన్లు లేకుండానే వెంచర్లు వేయడంతో పాటు, పంటకాల్వల్లో తూములను ఎలాంటి పర్మిషన్లు లేకుండా వేస్తున్నారు. రియల్ ఎస్టేట్ వెంచర్ల నిర్వహకుల నిర్వాహకంతో పంట కాల్వలను సైతం ఆక్రమించి తూములు ఏర్పాటు చేయటంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. సీఆర్‌డీఏ పర్మిషన్లు లేకుండానే వెంచర్లు వేయడంతో పాటు వ్యవసాయానికి ఉపయోగపడే పంట కాల్వలను ఆక్రమించి తూములు ఏర్పాటు చేస్తున్నారు. గత నెలలో కురిసిన వర్షాలకు కొండవీటి వాగు, ఎర్రవాగు ఉప్పొంగి ప్రవహించాయి. దీంతో వరద నీరు పొలాల్లోకి, రోడ్లు మీదకు వచ్చాయి. వరద ఉధృతి తగ్గినప్పటికి పొలాల్లో నీరు నాలుగైదు రోజుల వరకు నిలిచి ఉన్నాయి. గతంలో కొండవీటి వాగు, ఎర్రవాగు ప్రవహించినప్పటికి ఒకటి రెండు రోజులు మాత్రమే పొలాల్లో నీళ్లు నిలబడేవి. కానీ ఈసారి ఆ పరిస్థితి లేదు. ఎందుకంటే రియల్ యజమానులు అక్రమంగా వెంచర్ల వేయటంతో పాటు, పంట కాల్వలకు సరిపడ తూములు వేయకుండా చిన్న చిన్న తూములు వేయటంతో నీటి ప్రవాహం సక్రమంగా జరగకపోవటంతో నష్టం జరిగిందని రైతులు వాపోతున్నారు. అంతేకాకుండా పంటకాల్వలో తూములు వేయటానికి ఇరిగేషన్ అధికారులు పర్మిషన్లు తీసుకోవాల్సి ఉంది. ఇరిగేషన్, నాగార్జునసాగర్ ప్రాజెక్టు కాల్వల అధికారుల పర్మిషన్లు తీసుకోకుండానే పంట కాల్వల్లో తూములు, చప్టాలు నిర్మిస్తున్నారు. కొంత మంది ఏకంగా కాల్వల్లో గోడలను నిర్మించేస్తున్నారు. దీనివల్ల భారీ వర్షాలు కురినప్పుడు కాల్వల్లో నీరు సక్రమంగా ప్రవహించకుండా పొలాల్లోకి, రోడ్లపై చేరుకుంటున్నాయి. అయితే సెప్టెంబరులో కురిసిన వర్షాల వల్ల లాం, దామరపల్లి, తాడికొండ, కంతేరు, పొన్నెకల్లు, నిడుముక్కల, మోతడక గ్రామాల్లోని పొలాల్లో వర్షం నీరు ఎన్నడు లేనివిధంగా నాలుగైదు రోజులు నిలిచి ఉన్నాయి. దీంతో పంటనష్టం జరిగింది. మండలపరిధిలో 4500 ఎకరాల్లో పంట నష్టం జరిగినట్లు వ్యవసాయశాఖ అధికారులు అంచనాలు వేస్తున్నారు. లాం, తాడికొండ అడ్డరోడ్డు, తాడికొండ పరిసర ప్రాంతాల్లో మోకాళ్ల ఎత్తుల్లో నీళ్లు పారాయి. పంటకాల్వలను ఆక్రమించి చిన్న చిన్న తూములు వేయటంతో వెంచర్లలో నీళ్లు నిలిచాయి. చాలా మంది వెంచర్ల నిర్వాహకులు వ్యవసాయ ఇంజన్లు, మోటర్ల సహాయంతో నీటిని బయటకు పెట్టారు. ఇదిలా ఉండగా ఇరిగేషన్, ఎన్ఎస్‌పీ కాల్వల అధికారులు ఒకరిపై ఒకరు చెప్పుకుంటూ తమకు సంబంధం లేదని పంటకాల్వల్లోని తూముల వైపు కన్నెత్తి కూడా చూడటం లేదు. పంట కాల్వల్లో ఆక్రమణలు, అక్రమంగా తూముల నిర్మాణాలు జరుగుతున్నప్పటికీ అధికారులు మాత్రం తమకేమి పట్టనట్లు వ్యవహరిస్తున్నారు.

## వైభవంగా శ్రీగంగానమ్మదేవత గ్రామోత్సవం

● హంస వాహనంపై అమ్మవారి ఊరేగింపు



గంగానమ్మతల్లికి సమర్పించేందుకు సిద్ధం చేసిన అమ్మవారి సారె



పుష్పాలతో అలంకరించిన హంస వాహనంపై అమ్మవారి ఊరేగింపు

దుగ్గిరాల, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): చిలువూరులోని శ్రీగంగానమ్మదేవతా ఉత్సవాలు రెండోరోజు ఆదివారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆలయం 12వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని, రెండ్రోజులుగా ఉత్సవాలు కొనసాగుతున్న విషయం విదితమే. గ్రామస్థుడు డాక్టర్ రంగిశెట్టి జగదీష్‌బాబు ఇంటివద్ద అమ్మవారి కోసం తయారు చేసిన పలురకాల నైవేద్యాలను తొలుత సమర్పించారు. తదుపరి అమ్మవారిని పాలు, కుంకుమ, పసుపు, నీళ్లతో అభిషేకించారు. ఆలయ ప్రాంగణమంతా వివిధరకాల పుష్పాలతో నయనానందకరంగా అలంకరించారు. ఆలయ ఆనవాయితీ ప్రకారం గ్రామస్థులు బయోఫర్ అధినేత రంగిశెట్టి జగదీష్‌బాబు, రమేష్‌బాబులు, కుటుంబసభ్యులతో కలిసి హంసవాహనంపై అమ్మవారి ఊరేగింపును ప్రారంభించారు. కనక తప్పెట్లు, పలురకాల సంప్రదాయ వాయిద్యాలు, శ్రీఆంజనేయుడి వేషధారణలతో బృందం భక్తులకు వీనుల విందు చేశారు. ప్రముఖ గజల్ గాయకుడు గజల్ వినోద్ భక్తులను అమ్మవారి పాటలతో అలరించారు. ఆలయానికి ఊరేగింపుగా వెంట తీసుకువచ్చారు. అమ్మవారి ఉత్సవాలను తిలకించేందుకు మహిళలు, భక్తులు ఆలయానికి తరలివచ్చారు. జ్ఞాన ప్రదాతగా హంస వాహనంపై ఊరేగుతూ వచ్చిన అమ్మవారికి గ్రామవీధుల్లో అడుగడుగునా మహిళలు హారతులిచ్చారు.

## పట్టభద్రులైన యువత ఎమ్మెల్సీ ఓటు నమోదు చేసుకోవాలి

● తెలుగుయువత రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుట్టి రామచంద్రరావు



పెదపరిమి లైబ్రరి సెంటర్లో ఎమ్మెల్సీ ఓటు నమోదు కార్యక్రమంలో పాల్గొన్న టీడీపీ నాయకుడు పుట్టి రామచంద్రరావు తదితరులు

తుళ్లూరు, అక్టోబరు 20: (ఆంధ్రజ్యోతి) పట్టుభద్రులైన యువత ఎమ్మెల్సీ ఓటు నమోదు చేసుకుని కృష్ణా గుంటూరు జిల్లాల పట్టభద్రుల టీడీపీ ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను భారీ మెజార్టీతో గెలిపించుకోవాలని టీడీపీ యువత రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుట్టి రామచంద్రరావు అన్నారు. ఆదివారం మండలపరిధిలోని పెదపరిమి స్థానిక లైబ్రరి సెంటర్లో పట్టభద్రుల ఓటు నమోదు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఓటు నమోదు చేసుకునే వారు గెజిడెడ్ అధికారి సంతకం కలిగి ఏదైనా డిగ్రీ పాసైన ప్రొవిజన్ పత్రం, ఆధార్ ,ఓటర్ కార్డు జిరాక్స్ , పాస్‌పోర్టు సైజ్ ఫోటో ఒకటి అప్లికేషన్‌తో జత చేసి స్థానిక ఎమ్మార్వో కార్యాలయంలో అందజేయవచ్చని తెలిపారు. ఆన్‌లైన్‌లో ఇవే పత్రాలు అప్‌లోడు చేసి ఓటు నమోదు చేసుకోవచ్చన్నారు. ప్రతి గ్రామంలో టీడీపీ ఆధ్వర్యంలో అప్లికేషన్‌లు నింపే కార్యక్రమం జరుగుతుందన్నారు. యువతే కాకుండా పట్టభద్రులైన వారు ఎవరైనా ఓటు నమోదుకు అర్హులని సూచించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పుట్టి రామచంద్రరావు, నూతలపాటి రామారావు, బెల్లకొండ శ్రీనివాసరావు, భాష్యం చిన శ్రీధర్, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

### మైనార్టీ నేత మృతికి సీఎం సంతాపం

గుంటూరు, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): గుంటూరు తూర్పు నియోజకవర్గానికి చెందిన టీడీపీ మైనార్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ కరీముల్లా మృతికి సీఎం చంద్రబాబు సంతాపం తెలిపారు. కింది నుంచి రాష్ట్ర నేతగా కరీముల్లా ఎదిగారని, పార్టీ కోసం అహర్నిశలు శ్రమించే ఆయన మృతి చెందడం బాధాకరమని పేర్కొన్నారు. కరీముల్లా కుటుంబసభ్యులకు ముఖ్యమంత్రి సానుభూతి తెలియజేశారు.

### యూనియన్ బ్యాంకు ఆధ్వర్యంలో రిటైల్ లోన్ మేళా

గుంటూరు సిటీ, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): యూనియన్ బ్యాంకు ఆధ్వర్యంలో గుంటూరులోని యూనియన్ బ్యాంకు ప్రాంతీయ కార్యాలయంలో ఆదివారం రిటైల్ లోన్ మేళా నిర్వహించారు. వ్యక్తిగత, విదేశీ విద్య రుణాలు పొందిన వారికి పత్రాలను అందజేశారు. విదేశీ విద్య కోసం ఒక్కో అభ్యర్థికి రూ. 40 లక్షల వరకు రుణాలు మంజూరు చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ రీజనల్ హెడ్స్ అశ్వర్థ నాయక్, రాజేష్, రిటైల్ లోన్ పాయింట్ హెడ్ డీవీ రామాంజనేయులు పాల్గొని రుణపత్రాలు అందజేసినట్లు లీడ్ బ్యాంకు మేనేజర్ మహిపాల్ రెడ్డి తెలిపారు.

### టేబుల్ టెన్నిస్ క్రీడాకారిణికి ఆర్థిక సాయం

గుంటూరు(తూర్పు), అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): టేబుల్ టెన్నిస్ క్రీడల్లో జాతీయ స్థాయిలో రాణిస్తూ అనేక పతకాలు సాధించిన పల్నాడు జిల్లాలోని శావల్యాపురం మండలం మతుకుమల్లికి చెందిన పాపసాని హాసినికి కమ్మజన సేవాసమితి పాలక వర్గ సభ్యులు రూ.50 వేల ఆర్థిక సాయాన్ని ప్రకటించారు. స్థానిక కుందుల రోడ్డులోని కమ్మబాలికల వసతి గృహంలో ఆమెకు సమితి అధ్యక్ష, కార్యదర్శులు సామినేని కోటేశ్వరరావు, చుక్కపల్లి రమేష్‌లు ఈ చెక్కును అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ భవిష్యత్తులో కూడా హాసినికి చదువు, క్రీడల్లో సహాయ సహకారాలు అందజేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పాలకవర్గ సభ్యులు మర్రిపూడి సీతారామయ్య, రాయపాటి గోపాలకృష్ణ, ఘంటా పున్నారావు, పెద్ది సాంబశివరావు, కన్నెగంటి బుచ్చయ్య, విశ్రాంత ప్రిన్సిపాల్ జీవీ రాయుడు పాల్గొన్నారు.

## ఆరోగ్యకరమైన సమాజం కోసం పాటుపడాలి

● కమ్యూనిటి సైన్స్ ఆఫ్ డీన్ బీ శ్రీలక్ష్మి



ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకిస్తున్న కమ్యూనిటీ సైన్స్ శాస్త్రవేత్తలు, ఎంపీటీసీ సాంబశివరావు

తాడికొండ, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): ఆరోగ్యకరమైన సమాజం కోసం ప్రతి ఒక్కరు పాటుపడాలని కమ్యూనిటి సైన్స్ ఆఫ్ డీన్ బీ శ్రీలక్ష్మి తెలిపారు. మోతడక గ్రామంలో జాతీయ సేవా పథకం కింద అక్టోబరు 14 నుంచి 20 తేదీ వరకు ఎన్ఎస్ఎస్ క్యాంపును కమ్యూనిటి సైన్స్ కళాశాల విద్యార్థులు నిర్వహించారు. ఆరోగ్యకరమైన సమాజం కోసం ఆరోగ్య జీవన విధానం అనే అంశంపై శిక్షణ, అవగాహన కార్యక్రమాలు, ర్యాలీలు నిర్వహించారు. ఆది వారం పంచాయతీ కార్యాలయంలో ఫొటో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశారు. అవగాహన సదస్సులో హైస్కూల్ విద్యార్థులకు, మహిళలకు తక్కువ ఖర్చుతో పోషకాహార పంటలు, మానసిక ఆరోగ్య ప్రాముఖ్యత, కౌమార విద్య, వినియోగదారుల విద్య, అవయవదానం ప్రాముఖ్యం, మత్తు పదార్థాల, మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాల గురించి వివరించారు. ఈ సందర్భంగా డీన్ ఆఫ్ కమ్యూనిటి సైన్స్ బీ శ్రీలక్ష్మి మాట్లాడుతూ గ్రామాల్లో అవగాహన సదస్సులు నిర్వహించడం వల్ల విద్యార్థుల్లో మార్పులు చేకూరుతుందని తెలిపారు. సమాజంపై సేవాభావం పెరుగుతుందన్నారు. అంతేకాకుండా సామాజిక సేవపై అవగాహన, బాధ్యతలు కలుగ జేస్తుందని తెలిపారు. గ్రామాల్లో ప్రజలను చైతన్యవంతం చేయడానికి ఎన్ఎస్ఎస్ వారు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నారన్నారు. కార్యక్రమంలో కళాశాల అసోసియేట్ డీన్ చైతన్యకుమారి, మోతడక ఎంపీటీసీ సభ్యులు కంచర్ల సాంబశివరావు, గ్రామ ఉపసర్పంచ్ కే సీతారామయ్య, మాజీ సర్పంచ్ జీ ఏడుకొండలు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ బిల్కిస్, పూర్ణిమ, కళాశాల సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.


## ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కుల పంపిణీ



సీఎం సహాయనిధి చెక్కు అందజేస్తున్న టీడీపీ స్థానిక నేతలు

దుగ్గిరాల, అక్టోబరు 20: దుగ్గిరాలకు చెందిన ఒకరికి, గొడవర్రుకు చెందిన ఒకరికి ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి నగదు చెక్కులను, టీడీపీ మండల నాయకుల చేతులమీదుగా ఆదివారం సాయంత్రం అందించారు. అనారోగ్యంతో బాధపడి చికిత్స పొందిన అనంతరం దుగ్గిరాల రైలుపేటకు చెందిన జంపాల ఉమామహేశ్వరరావుకు వారికైన వైద్యఖర్చుల నిమిత్తం, రూ.లక్షా 50వేల నగదు చెక్కును అందించారు. అదేవిధంగా అనారోగ్యం బారినపడి, మృత్యువుతో పోరాడి మృతి చెందిన గొడవర్రు గ్రామస్థురాలు విశ్వనాధపల్లి దివ్యకైన వైద్య ఖర్చుల నిమిత్తం వెచ్చించిన భర్త పవన్‌కు రూ.75వేల నగదు చెక్కును ముఖ్యమంత్రి సహాయనిధి కింద అందించారు. బాధితుల పరిస్థితిని రాష్ట్ర మంత్రి నారా లోకేశ్ దృష్టికి తీసుకెళ్లగా వెంటనే స్పందించి, సహాయ సహకారాలు అందించి నందుకు కృతజ్ఞతలు తెలిపారు. టీడీపీ మండల అధ్యక్షురాలు కేసంనేని శ్రీఅనిత, మాజీ ఎంపీపీ వెనిగళ్ల శ్రీకృష్ణప్రసాద్, సర్పంచ్ విశ్వనాధపల్లి ఉమాదేవి, ఎంపీటీసీ శివ కుమార్, టీఎస్‌యూఎస్ అధ్యక్షుడు వల్లూరు నరసింహారావు, దేవరపల్లి చంటి, కేసంనేని వాసుబాబు, సాంబానాయక్, టైలర్ బాషా, ఖురేషి, గరికా శ్రీను, ప్రసంగి కొండలు తదితరులు పాల్గొన్నారు.

### పెదపరిమిలో కంటి శుక్లాల నిర్ధారణ పరీక్ష శిబిరం



కంటి శుక్లాల నిర్ధారణ శిబిరాన్ని పర్యవేక్షిస్తున్న టీడీపీ నేతలు

తుళ్లూరు, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి) మండలపరిధిలోని పెదపరిమిలో తెలుగుయువత రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుట్టి రామచంద్రరావు నేతృత్వంలో ఎన్నారై మెడికల్ కాలేజీ హాస్పిటల్ వారు కంటి శుక్లాల నిర్ధారణ పరీక్ష శిబిరాన్ని ఆదివారం నిర్వహించారు. 144 మందిని పరీక్షించగా 18 మందికి శుక్లాలున్నట్టు నిర్ధారించారు. వారికి ఉచితంగా ఆపరేషన్లు నిర్వహించడానికి ఏర్పాటు చేస్తామని హాస్పిటల్ సిబ్బంది, టీడీపీ నేత రామచంద్రరావు అన్నారు.

## వైవిధ్య ఉత్పత్తుల్లో ప్రపంచ అగ్రగామిగా టాటా

● ఆర్థిక నిపుణుడు చెరుకూరి కుటుంబరావు

గుంటూరు కార్పొరేషన్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ వ్యాప్తంగా 100 దేశాల్లో వైవిధ్యం గల వస్తు ఉత్పత్తి చేస్తూ 420 బిలియన్ డాలర్ల వార్షిక ఆదాయంతో ప్రపంచ గుర్తింపు పొందిన వ్యాపార దిగ్గజంగా టాటా గ్రూప్ రూపొందటం అభినందనీయమని ప్రముఖ ఆర్థిక నిపుణుడు, ప్రణాళిక సంఘ పూర్వ ఉపాధ్యక్షుడు చెరుకూరి కుటుంబరావు తెలిపారు. ఆదివారం గుంటూరులోని జనచైతన్య వేదిక హాల్లో 'భారత్ ప్రగతిలో టాటా పాత్ర' అనే అంశంపై చర్చా గోష్ఠి జరిగింది. తొలుత రతన్ టాటా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ముఖ్యఅతిథి కుటుంబరావు మాట్లాడుతూ భారతదేశంలో 1868లో ప్రారంభించిన టాటా గ్రూప్ దేశానికి ఆర్థిక పునాదులు వేశారని, సంక్షేమం, దాతృత్వాన్ని చాటి చెప్పారని అన్నారు. సభకు అధ్యక్షత వహించిన జనచైతన్య వేదిక అధ్యక్షుడు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి మాట్లాడుతూ విశిష్ట సేవలందించిన రతన్ టాటాను 'భారతరత్న'తో గౌరవించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. డొక్కా మాణిక్య వరప్రసాద్ మాట్లాడుతూ సీఎం చంద్రబాబునాయుడు రతన్ టాటా ఇన్నోవేటివ్ హబ్‌ను ప్రకటించడం హర్షణీయమన్నారు. ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు, మహాత్మాగాంధీ కళాశాల ప్రిన్సిపాల్ డీఏఆర్ సుబ్రహ్మణ్యం, మానవతా సంస్థ చైర్మన్ పి.రమేష్ తదితరులు మాట్లాడారు.

### నేడు గుంటూరులో జరిగే సభను జయప్రదం చేయండి

తాడేపల్లి, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): సమకాలీన రాజకీయ పరిణామాలపై గుంటూరులోని వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో సోమవారం సాయంత్రం 4 గంటలకు జరిగే సభను జయప్రదం చేయాలని సీపీఎం మండల కార్యదర్శి దొంతిరెడ్డి వెంకటరెడ్డి విజ్ఞప్తి చేశారు. ఆదివారం మండలంలోని చిర్రావూరులో సీపీఎం నాయకులు కరపత్రాలు పంపిణీ చేస్తూ ప్రచారం నిర్వహించారు. వెంకటరెడ్డి మాట్లాడుతూ దేశరాజకీయ పరిణామాలు వేగంగా మారుతున్న తరుణంలో మూడోసారి కేంద్రంలో అధికారంలోకి వచ్చిన బీజేపీ అనుసరిస్తున్న రాజకీయ విధానాలు నిత్యం పెరుగుతున్న ధరలు, ఆర్థిక మాంద్యం, మతోన్మాదం తదితర అంశాలపై సభ జరుగుతుందన్నారు. ఈ సభలో సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బీవీ రాఘవులు, ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు, సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సీహెచ్ బాబూరావు తదితరులు పాల్గొని ప్రసంగిస్తారన్నారు. ఈ ప్రచార కార్యక్రమంలో సీపీఎం నేతలు జొన్నా శివశంకర్, దొంతిరెడ్డి వెంకటరెడ్డి, బొప్పన గోపాలరావు, శివనాగేశ్వరరావు, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు. కాగా కుంచనపల్లిలో జరిగిన కార్యక్రమంలో జొన్నా శివశంకర్ మాట్లాడుతూ ఈ నెల 22న విజయవాడ ఎంబీవీకేలో జరిగే వ్యవసాయ రంగ సమస్యలు, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల విధానాలు, జాతీయ సదస్సు జయప్రదం చేయాలని కోరారు.

## నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

● డీఎస్పీ మల్లికార్జునరావు



సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ

వట్టిచెరుకూరు, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత సమాజంలో రోజు రోజుకు వివిధ పద్ధతుల్లో నేరాలు పెరిగి పోతున్నాయని, అలాంటి వాటిపై ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలని డీఎస్పీ ఎం మల్లికార్జునరావు అన్నారు. మండలంలోని కోవెలమూడి గ్రామంలో ఆదివారం రాత్రి ఎస్పీ రూపొందించిన వారధి కార్యక్రమంలో భాగంగా ప్రజలతో మమేకమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు, పోలీసులు వేర్వేరు అనే భావన తొలగిపోవాలని, అవగాహన లేకుండా పలువురు మోసగాళ్ల బారిన పడి ఇబ్బందులు పడుతున్నారని, అలాంటి మోసగాళ్లతో ప్రతిఒక్కరు అప్రత్తంగా ఉండాలని డీఎస్పీ మల్లికార్జున రావు ప్రజలకు సూచించారు. పోలీసుశాఖ ప్రజలకు ఎప్పుడు అందుబాటులో ఉంటుందనే భరోసా కల్పించారు. కార్యక్రమంలో సీఐ రమానాయక్, ఎస్ఐ సుబ్బారావు, సిబ్బంది పాల్గొన్నారు.

## కలాం అవార్డు గ్రహీతకు అభినందనలు



ఎమ్మెల్సీ లక్ష్మణరావు నుంచి అబ్దుల్‌కలాం అవార్డు అందుకుంటున్న పోపూరి లక్ష్మీనారాయణ

పెదనందిపాడు, అక్టోబరు, 20 (ఆంధ్రజ్యోతి): ఏపీజే అబ్దుల్‌కలాం జాతీయ అవార్డుకు ఎంపికైన పెదనందిపాడుకు చెందిన రోటరీ జిల్లా మీడియా కోఆర్డినేటర్, అశోకా పాఠశాల డైరెక్టర్ పోపూరి లక్ష్మీనారాయణకు పలువురు అభినందనలు తెలిపారు. ఆదివారం గుంటూరు ఏసీ కళాశాలలో ఎన్‌పీఎల్‌టీవో సంస్థ ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు, గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ చేతులమీదుగా అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా స్థానిక అశోకా పాఠశాలలో రోటరీ క్లబ్ వారు అభినందనసభ ఏర్పాటు చేశారు. క్లబ్ సభ్యులు లక్ష్మీనారాయణను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో అధ్యక్షుడు నల్లపునేని శివప్రసాద్, కోశాధికారి వై రమణయ్య, సభ్యులు శ్యాంసన్ తదితరులు పాల్గొన్నారు.

## వైద్యశిబిరానికి అనూహ్య స్పందన



వైద్యపరీక్షలు చేయించుకున్న స్థానికులు

తాడేపల్లి, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లి మండలం కుంచనపల్లిలోని రామ్‌స్నేహ అవెన్యూ అపార్టుమెంట్‌లో ఆదివారం మానవసేవా సంస్థ వ్యవస్థాపకుడు వంగర సురేష్‌కుమార్ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ వైద్యశిబిరానికి కుంచనపల్లివాసులు భారీ సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా సంస్థ వ్యవస్థాపకుడు వంగర సురేష్‌కుమార్ మాట్లాడుతూ తమ సంస్థ ద్వారా ప్రజలకు అనేక వైద్యసేవలు అందించామన్నారు. ఉచితంగా అనేకమందికి కంటి ఆపరేషన్లు చేయించామన్నారు. రామ్‌స్నేహ అవెన్యూ అపార్టుమెంట్‌లో ఇక నుంచి ప్రతి నెల రెండో ఆదివారం ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేస్తామని చెప్పారు. వైద్యశిబిరంలో కంటి, పంటి, జనరల్, డయాబెటిక్ వైద్యులు పాల్గొని పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. బీపీ, షుగరు పరీక్షలు కూడా నిర్వహించారు. కార్యక్రమంలో సంస్థ వ్యవస్థాపకులు వంగర సురేష్‌కుమార్, వైద్యులు డాక్టర్ శ్రీకర్, శశిధర్, స్థానికులు, సుధాకర్‌బాబు, వెంకటరెడ్డి, పరమేశ్వరి, హనుమాన్, సుబ్బారెడ్డి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## వర్మ కమిషన్ సూచనలు అమలు చేయాలి

● ఐద్వా అధ్యక్ష, కార్యదర్శులు ప్రభావతి, రమాదేవి

తాడేపల్లి, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): మహిళలపై వేధింపుల నివారణకు వర్మ కమిషన్ సూచనల అమలుకు అవసరమైన చర్యలు చేపట్టాలని ఐద్వా రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ప్రభావతి, డి.రమాదేవి ఆదివారం విడుదల చేసిన ఓ సంయుక్త ప్రకటనలో డిమాండ్ చేశారు. బద్వేలులో ఇంటర్ చదువుతున్న అమ్మాయిని ప్రేమ పేరుతో బయటకు తీసుకువెళ్లి పెట్రోల్ పోసి నిప్పంటించిన ఘటన మన రాష్ట్రంలో మహిళలకు ఏమాత్రం భద్రతలేని స్థితిని సూచిస్తుందన్నారు. ఇలాంటి దుర్మార్గాలు అరికట్టేందుకు ప్రభుత్వం ఏమి చర్యలు చేపడతుందో ప్రజలకు తెలియజేయాలన్నారు. నిందితుడు గణేష్‌తోపాటు కొంతమంది స్నేహితులు కూడా బాలికలను వేధిస్తున్నారని, స్థానికులు చెబుతున్నారన్నారు. గణేష్ కేసును ఫాస్ట్ ట్రాక్ కోర్టుకు అప్పగించి కఠినంగా శిక్షించాలని బాధితురాలి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని వారు డిమాండ్ చేశారు.